మావోయిస్టులకు వ్యతిరేకంగా పోస్టర్లు

కృష్ణకాలనీ, జూలై 28 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి మండలంలోని పలు అటవీ గ్రామాల్లో మావోయిస్టులకు వ్యతిరేకంగా సోమవారం పోస్టర్లు వెలిశాయి. ఆజంనగర్, నాగారం, గొల్లబుద్దారం తదితర గ్రామాల్లో ప్రధాన వీధుల్లో 'మావోయిస్టు ఆత్మ పరిరక్షణ ప్రజాఫ్రంట్ తెలంగాణ' పేరుతో ముద్రించిన పోస్టర్లు వెలిశాయి. 'మావోయిస్టు అగ్రనాయకుల్లారా.. ఇకనైనా మీ కాలం చెల్లిన సిద్ధాంతాన్ని వీడి, కాలనుగుణంగా మారిన ప్రజా జీవన విధానంలో పాత్రులు కండి' అంటూ పేర్కొన్నారు.

తాడిచర్లలో..

మల్హర్ (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన తాడిచర్లలో మావోయిస్టులకు వ్యతిరేకంగా పోస్టర్లు వెలిశాయి. గ్రామపంచాయతీ కార్యాలయ కంపౌండ్ వాల్‌కు వాటిని అంటించారు. మావోయిస్టులు అడవిని వీడి ప్రజల్లోకి వచ్చి ప్రజాస్వామ్య గొంతుకావాలని పేర్కొన్నారు. ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలోకి రావాలని కోరారు.

ముమ్మరంగా పోలీసుల తనిఖీలు

వెంకటాపురం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టుల వారోత్సవాల నేపథ్యంలో స్థానిక ఎస్సై కొప్పుల తిరుపతిరావు ఆధ్వర్యంలో సివిల్, సీఆర్పీఎఫ్ సిబ్బంది సోమవారం మండలంలోని ఎదిర, ఆలుబాక గ్రామ శివారుల్లో వాహన తనిఖీలను ముమ్మరం చేశారు. మండల కేంద్రానికి వచ్చిపోయే వాహనాలను ఎస్సై క్షుణ్ణంగా పరిశీలించి అనుమానితుల నుంచి పూర్తి సమాచారాన్ని సేకరించారు.


ఏటూరునాగారం (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల నేపథ్యంలో నక్సల్స్ ప్రభావిత ప్రాంతమైన ఏటూరునాగారం అడవులను పోలీసులు జల్లెడ పడుతున్నారు. మండల కేంద్రంలోని వైజంక్షన్ మలుపు వద్ద, బూర్గంపాడు-ఏటూరునాగారం జాతీయ రహదారిలో సోమవారం వాహన తనిఖీలు చేపట్టారు. ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ అదేశాల మేరకు ఏటూరునాగారం సీఐ అనుముల శ్రీనివాస్, ఎస్సై రాజకుమార్ ఆధ్వర్యంలో (మిగతా 8లో...)

క్లారిటీ వచ్చినట్టేనా?

- బీఆర్ఎస్ సారథ్యంపై భూపాలపల్లి నియోజవర్గంలో చర్చ
- రెండు వర్గాలుగా చీలిపోయిన పార్టీ
- వెంకటరమణారెడ్డి, మధుసూదనాచారి మధ్య వర్గపోరు!
- కేటీఆర్ హామీతో గండ్ర గ్రూపులో ఫుల్ జోష్
- నైరాశ్యంలో మధుసూదనాచారి అనుచరులు



కృష్ణకాలనీ, జూలై 28 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి బీఆర్ఎస్‌లో నెలకొన్న సందిగ్ధత తొలిగిపోయిందని తెలుస్తోంది. నియోజకవర్గ ఇన్‌చార్జి ఎవరనేది క్లారిటీ వచ్చిందటున్నారు ఆ పార్టీ శ్రేణులు. ఆదివారం తన పర్యటన సందర్భంగా వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆ విషయాన్ని చెప్పకనే చెప్పారనే చర్చ సాగుతోంది. రెండు వర్గాలుగా బీఆర్ఎస్ చీలిపోగా పార్టీలో కొంత కాలంగా కన్ఫ్యూజన్ నెలకొంది. తామే నియోజకవర్గ ఇన్‌చార్జిలం అంటూ మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, మధుసూదనాచారి తమ కేడర్‌కు చెప్పుకుంటూ వచ్చారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ టికెట్ తనకే అంటూ మాజీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి తమ అనుచరులతో చెప్పుకొచ్చారు. అలాగే ఎమ్మెల్సీ మధుసూదనాచారి అదే తరహాలో ధీమా వ్యక్తం చేస్తూ వచ్చారు. వచ్చే అసెంబ్లీ టికెట్ తనకేనంటూ కేడర్‌కు భరోసా ఇస్తూ వచ్చారు. ఈ నేపథ్యంలో ఇద్దరు నేతలూ నియోజకవర్గంలో పర్యటించి కేడర్‌ను ఆకర్షించే పనిలో పడ్డారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలో పార్టీకి ఇద్దరిలో పెద్ద దిక్కు ఎవరవుతారనే ఉత్కంఠ పార్టీ శ్రేణుల్లో నెలకొంది. అయితే.. ఎట్టకేలకు కేటీఆర్ ఈ విషయంపై క్లారిటీ ఇచ్చారనే చర్చ జోరుగా సాగుతోంది. వెంకటమరణారెడ్డి నాయకత్వంలోనే పార్టీ ముందుకు పోతుందని కేటీఆర్ అనడంతో ఇన్నాళ్లు నెలకొన్న సందిగ్ధతకు తెరపడినట్టయ్యిందని తెలుస్తోంది.



గండ్రనే చూసుకుంటారట!

భూపాలపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ బాధ్యతలు గండ్ర వెంకటరమణారెడ్డి చూసుకుంటారని ఆదివారం జరిగిన కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ స్పష్టతనిచ్చారు. దీంతో నియోజకవర్గంలోని గండ్ర వర్గీయుల్లో నూతనోత్సాహం ఉరకలేస్తోంది. ఇన్నాళ్లు గండ్రకే టికెట్టు వస్తుందని నాయకులు, కార్యకర్తలు భావించినప్పటికీ లోలోపల ఎక్కడో ఒకింత మదన పడేవారు. ఈ నేపథ్యంలో కేటీఆర్ తాజా ప్రకటన కార్యకర్తలు, నాయకుల్లో మరింత జోష్‌ను నింపింది.

మౌనంగానే మధుసూదనాచారి!

రాష్ట్రంలో బీఆర్ఎస్‌లో కీలకంగా వ్యవహరిస్తున్న ఎమ్మెల్సీ మధుసూదనాచారి భూపాలపల్లి నియోజకవర్గంలో నెలకొన్న రాజకీయ పరిణామాలపై మొదటి నుంచి కూడా మౌనంగా ఉంటున్నారు. ఇక్కడ నెలకొన్న పరిస్థితులపై ఆయన ఏనాడూ ప్రత్యేక్షంగా మాట్లాడిన దాఖలాలు లేవు. పరోక్షంగా మాత్రం నాయకులు, కార్యకర్తలకు తానే ఇక్కడ నాయకత్వం వహిస్తానని చెప్పుకున్నారనే చర్చ సాగుతోంది. మరోవైపు గత ఎన్నికల్లో రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారం కోల్పోవడం, ఆ పార్టీ నుంచి పోటీ చేసిన వెంకటరమణారెడ్డి ఓటమి చెందడం జరిగిపోయాయి. వచ్చే ఎన్నికల్లో కేసీఆర్ మార్పులు చేర్పులు చేస్తారని, తద్వారా మధుసూదనాచారికే అసెంబ్లీ టికెట్టు వస్తుందని ఆయన వర్గం, అభిమానాలు చర్చించుకున్నారు. ఈ క్రమంలో కార్యకర్తల సమావేశంలో స్వయంగా కేటీఆర్ చేసిన వ్యాఖ్యలతో మధుసూదనాచారి వర్గం ఒకింత డీలా పడినట్టు తెలుస్తోంది. మధుసూదనాచారి సేవలను రాష్ట్ర రాజకీయాల్లోనే కేసీఆర్ వినియోగించుకుంటారని, భూపాలపల్లిలో మాత్రం వెంకటరమణారెడ్డి సారథ్యమే కొనసాగుతుందని కేటీఆర్ ఇచ్చిన సంకేతాలు చర్చనీయాంశమయ్యాయి.

ఇకనైనా కలిసొచ్చేనా?

భూపాలపల్లి నియోజకవర్గంలో బీఆర్ఎస్ రెండు వర్గాలనేది అందరికి తెలిసిన విషయమే. అయితే.. ఇక్కడ వెంకటరమణారెడ్డి, మధుసూదనాచారికి మంచి పట్టే ఉంది. ప్రజల్లో ఇద్దరికీ మంచి గుర్తింపు ఉంది. ఈ నేపథ్యంలో ఇరువురికి వారివారి స్థాయికి తగ్గట్లుగా అనుచరగనం సైతం ఉంది. అయితే.. ప్రస్తుతం రెండు వర్గాలుగా ఉన్న బీఆర్ఎస్ కేటీఆర్ మాటలతో ఒక్కటైందనే భావన వ్యక్తమవుతోంది. కానీ, పార్టీలోకి పాత, కొత్త వర్గం కలిసి పని చేసేనా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. బేధాభిప్రాయాలు లేకుండా పార్టీలో అందరిని కలుపుకోవాలని సభావేదిక ద్వారానే గండ్ర వెంకటరమణారెడ్డికి కేటీఆర్ సూచన చేశారు. అయితే, భూపాలపల్లి పట్టణంతోపాటు నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో ప్రస్తుతం వెంకటరమణారెడ్డి వర్గం వారే పార్టీలో క్రియాశీలకంగా ఉంటున్నారనే అభిప్రాయం ఉంది. చారి వర్గంగా ఉండి గతం నుంచి పార్టీలో పని చేసిన వారితో పాటు పబ్లిక్‌లో సైతం మంచి పేరున్న వారికి సముచిత స్థానం కల్పిస్తే బీఆర్ఎస్‌కు ఇక్కడ డోకా లేకుండా పోతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే, గండ్ర తీసుకునే నిర్ణయం ఎలా ఉండబోతుందనే చర్చ సైతం జోరందుకుంది.

కేసీఆర్‌ది అబద్ధాల కుటుంబం

- రాజకీయ అవగాహన లేని బచ్చాగాడు కేటీఆర్
- అవినీతి అడ్డాను ప్రక్షాళన చేస్తున్నాం
- మాజీ ఎమ్మెల్యేకు వ్యాపారాలు లేవని చెప్పడం విడ్డూరం
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర

భూపాలపల్లిటౌన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్‌ది అబద్ధాల కుటుంబం అని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆరోపించారు. భూపాలపల్లిలోని కాంగ్రెస్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేటీఆర్ అంటే.. కల్వకుంట్ల తుపాకీ రాముడు అని వ్యాఖ్యానించారు. రాజకీయ అవగాహనలేని బచ్చాగాడు కేటీఆర్ అని విమర్శించారు. తెలంగాణ ఉద్యమం జరుగుతున్న నేపథ్యంలో ఆయన అమెరికాలో ఉన్నారని అన్నారు. ప్రజలంతా రోడ్డెక్కి, తీవ్రస్థాయిలో ఉద్యమం చేయడమే కాకుండా 1200 మంది బలిదానాలు చేశారని గుర్తు చేశారు. ఈ క్రమంలోనే జరుగుతున్న పరిణామాలను తెలుసుకున్న కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ స్పందించి తెలంగాణ ఇచ్చారని అన్నారు. ఇప్పుడు వచ్చి లుచ్చా కాంగ్రెస్, దున్నపోతు ప్రభుత్వమని కేటీఆర్ మాట్లాడడం అవగాహనలేని తీరుకు అద్దం పడుతోందని దుయ్యబట్టారు. భాష మార్చుకోకపోతే ప్రజలు మళ్లీ కర్రుకాల్చి వాతపెడతారని అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెప్పినా పార్లమెంటు ఎన్నికల్లో గుండు సున్నా (మిగతా 8వ పేజీలో)

కాళేశ్వరంలో శ్రావణ సందడి

భారీగా తరలివచ్చిన భక్తులు


గర్భాలయంలో పూజల్లో భక్తులు

మహదేవపూర్, జూలై 28(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన శ్రీకాళేశ్వర ముక్తీశ్వరాలయానికి సోమవారం భక్తుల తాకిడి పెరిగింది. శ్రావణమాసం, అందులోనూ తొలి సోమవారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. గోదావరి నది, త్రివేణి సంగమంలో పవిత్ర స్నానం ఆచరించి ఆలయంలో విశిష్ట పూజలు నిర్వహించారు.

ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ


సభలో మాట్లాడుతున్న జాన్ వెస్లీ

జనగామ రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కేంద్ర అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై నిరంతర పోరాటాలు చేస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. మాజీ ఎమ్మెల్యే, స్వాతంత్ర్య సమర యోధుడు, సీపీఎం నాయకుడు ఏసిరెడ్డి నర్సింహారెడ్డి 34వ వర్ధంతి సభను సోమవారం జనగామ జిల్లా కేంద్రంలో జిల్లా జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. నెహ్రూ పార్కు నుంచి సాయిరాం కన్వెన్షన్ హాల్ వరకు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సంతాప సభలో ఏసిరెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. జాన్‌వెస్లీ మాట్లాడుతూ కేంద్రం అనుసరిస్తున్న నూతన ఆర్థిక కార్పొరేట్ విధానాలతో దేశ ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. రెండు శాతం లేని కార్పొరేటు శక్తులు, పెట్టుబడిదారులు, ధనికవర్గాల చేతిలో దేశ సంపదంతా ఉండడంతో, ఆర్థిక అసమానతలు, పేదరికం పెరిగిపోతోందన్నారు. లక్షల కోట్ల రాయితీలు ఇస్తూ ఓట్లు వేసిన గెలిపించి, గద్దె మీద కూర్చుండబెడుతున్న ప్రజలపై జీఎస్టీ పేరుతో పన్నుల భారాలను వేస్తుందని మండిపడ్డారు.

రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం లేదని, కార్మిక, వ్యవసాయ రంగ వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో విద్వేశాలను రెచ్చగొడుతూ కులాలు, మతాల మధ్య చిచ్చు పెడుతున్నారని ఆరోపించారు. ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలకు నిధులు ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేస్తుందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయకుండా కాలయాపన చేస్తుందన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలపై రాష్ట్ర వ్యాప్తంగా స్థానిక సమస్యలపై ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో కార్యకర్తలు పర్యటించి సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేయాలన్నారు. కార్యక్రమంలో రాపర్తి రాజు, ఇర్రి అహల్య, సాంబరాజు యాదగిరి, రమేష్, శంకర్, ప్రకాష్, భూక్యా చందు నాయక్, ఎండి.షబీనా పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో తెరుచుకోని కార్యాలయాలు

భూపాలపల్లి కలెక్టరేట్, జూలై 28(ఆంధ్రజ్యోతి): సమీకృత కలెక్టరేట్‌లో పలు ప్రభుత్వ కార్యాలయాలు పనిదినాల్లో కూడా తెరుచుకోవడం లేదు. ప్రతి సోమవారం కలెక్టర్ అధ్యక్షతన చేపట్టే ప్రజావాణికి ఎంతో మంది కలెక్టరేట్ వస్తుంటారు. అందులో చాలా మంది తమ సమస్యలను చెప్పుకుంటే, మరికొంత మంది పలు కార్యాలయాల్లో ఫిర్యాదులు చేస్తుంటారు. కలెక్టర్ రాహుల్‌శర్మ సోమవారం జిల్లాలో అందుబాటులో లేకపోవడంతో సమీకృత కలెక్టరేట్ ప్రాంగణంలో డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్, ఫుడ్ సెఫ్టీ ఆఫీసర్ కార్యాలయాలు తెరుచుకోలేదు. మధ్యాహ్నం వరకు కూడా సిబ్బంది కార్యాలయాల్లోకి రాకపోవడంతో ఈ రెండు ఆఫీసులు తాళాలు వేసే కనిపించాయని అక్కడికి వచ్చిన వారు తెలిపారు. వానాకాలం నడుస్తుండటంతో ఎంతో కీలకమైన డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్, ఫుడ్ సెఫ్టీ ఆఫీసర్ కార్యాలయాలు తెరుచుకోకపోవడం సిబ్బంది నిర్లక్ష్యానికి నిదర్శనమనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- వరదల వల్ల ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడాలి
- ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రత్యేక అధికారి శశాంక
- జంపన్నవాగు, గోదావరి ఉధృతి పరిశీలన

ఏటూరునాగారం రూరల్, జూలై28 (ఆంధ్రజ్యోతి) : వరదల వల్ల ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రత్యేక అధికారి శశాంక అన్నారు. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలో ఆయన సోమవారం పర్యటించారు. ఐటీడీఏ ఐటీడీఏ కార్యాలయంలో అధికారులతో సమావేశమై వరదల రక్షక చర్యలపై సంసిద్ధత, చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించారు. గోదావరి, జంపన్నవాగు ముంపు ప్రాంతాల్లో చేపడుతున్న సమాయక చర్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. భారీగా వర్షాలు కురుస్తున్న సమయంలో జిల్లాలో నమోదవుతున్న వర్షపాతంపై ప్రజలకు ఎప్పటికపుడు సమాచారం అందించాలని, మండలాల్లో ఏయే వాగులు ప్రమాదకరంగా మారి ప్రజలకు ఇబ్బందికరంగా ఉన్నాయో వాటిపై ఎప్పటికప్పుడు సమీక్షించాలన్నారు. ప్రమాదకరంగా ప్రవహిస్తున్న వాగులు, వంకల వద్ద తప్పనిసరిగా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని, ఆ సందర్భంలో ఎవరూ వాగులు దాటే ప్రయత్నాలు చేయకుండా తగు జాగ్రత్తలు పాటించాలని అన్నారు. గోదావరి, జంపన్నవాగు, రామప్ప, లక్నవరం జలాశయాలు నీటి నిల్వలు ఎక్కువగా ఉన్న సమయంలో చేపలు పట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గోదావరి, జంపన్నవాగు ప్రమాదకర స్థాయిలో ప్రవహించినట్లయితే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లోని ప్రత్యేకాధికారులు పర్యటిస్తూ ఉండాలని, ప్రజలు ఎదుర్కొంటున్నా సమస్యలను గుర్తించి వాటిని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని అన్నారు. గ్రామాల్లో పారిశుధ్య పనులను ముమ్మరం చేయాలని, తరచూ వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని అన్నారు. వానాకాలంలో వైద్యశాలల్లో సరిపడా మందులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో ఎస్పీ శబరీశ్, ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా, ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, అడిషనల్ కలెక్టర్(రెవెన్యూ) మహేందర్, అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) సంపత్‌రావు, ఆర్డీవో వెంకటేశ్ ఏపీవో వసంతరావు, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

గోదావరి కరకట్ట, దొడ్ల బ్రిడ్జి పరిశీలన

మండలంలోని దొడ్ల వద్ద జంపన్నవాగు, రామన్నగూడెంలోని పుష్కరఘాట్ వద్ద గల గోదావరి కరకట్టను ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రత్యేక అధికారి శశాంక పరిశీలించారు. జంపన్నవాగు వద్ద బ్రిడ్జితో పాటు కొండాయిలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. రేషన్ బియ్యం, వైద్యం, పాఠశాల, పారిశుధ్యం, విద్యుత్తు సౌకర్యం, బీఎస్ఎన్ఎల్ సిగ్నల్ సమస్య తదితర అంశాలపై అధికారులకు సూచనలు చేశారు. మండలంలోని రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద గోదావరి ఉధృతితో పాటు కరకట్టను పరిశీలించారు. ప్రమాదకరంగా మారిన కరకట్టను పరిశీలించిన ఆయన తగిన చర్యలు తీసుకోవాలని జల వనరుల శాఖ అధికారులకు సూచించారు. గోదావరి పెరిగితే లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఆయన వెంట ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా, అడిషనల్ కలెక్టర్ మహేందర్, ఆర్డీవో వెంకటేశ్ ఉన్నారు.


దొడ్ల వద్ద అధికారులతో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి శశాంక

కొండాయిలో ఉండలేం..

- ఊరు వదిలి వలస పోతున్న గ్రామస్థులు

ఏటూరునాగారం రూరల్, జూలై 28, (ఆంధ్రజ్యోతి) : జంపన్నవాగు సృష్టించిన జల ప్రళయం రెండేళ్ల గడిచినప్పటికీ మండలంలోని కొండాయి గ్రామస్తులను ఆ పీడకల వెంటాడుతూనే ఉంది. వానాకాలంలో ప్రశాంతంగా ఇళ్లల్లో నిద్రపోయే పరిస్థితులు లేవని, ఏ క్షణాన ఏం జరుగుతుందో అని ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంకా ఈ ఊరిలో బతకలేమని మూట ముల్లె సర్దుకొని సోమవారం వేరే గ్రామానికి తరలివెళ్లారు. ఇలా 20 కుటుంబాలు జంపన్నవాగు వద్ద పడవ ఎక్కి (మిగతా 8వ పేజీలో)


మూట, ముల్లె సర్దుకొని వేరే ప్రాంతానికి తరలుతున్న గ్రామస్తులు

మేడిగడ్డ బ్యారేజీకి కొనసాగుతున్న వరద

5.39 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

మహదేవపూర్ రూరల్, జూలై 28(ఆంధ్రజ్యోతి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం కొనసాగుతోంది. సోమవారం బ్యారేజీకి ఇన్‌ఫ్లో 5.39లక్షల క్యూసెక్కులుగా నమోదుకాగా గేట్లన్నీ ఓపెన్ చేసి వచ్చిన నీటిని వచ్చినట్టే దిగువకు పంపిస్తున్నారు. మళ్లీ మధ్యాహ్నం నుంచి ప్రవాహం కొంత తగ్గు ముఖం పడుతోంది. బ్యారేజీ వద్ద గోదావరి 6.94 మీటర్ల ఎత్తులో ప్రవహిస్తోంది.

గోదావరి దోబూచులాట

ఉదయం పెరుగుతూ సాయంత్రానికి తగ్గుముఖం


కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద గోదావరి

మహదేవపూర్/ఏటూరునాగారం రూరల్/వాజేడు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని కాళేశ్వర త్రివేణి సంగమం వద్ద గోదావరి నది దోబూచులాడుతోంది. ఉదయం పెరుగుతూ..సాయంత్రానికి తగ్గుతూ వస్తోంది. సోమవారం త్రివేణి సంగమం వద్ద గోదావరి 9.770 మీటర్ల ఎత్తులో ప్రవహించింది. ఏటూరునాగారం మండలంలోని రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద గోదావరి సోమవారం పెరుగుతూ తగ్గుతూ వచ్చింది. ఉదయం 11 గంటల దాకా క్రమంగా పెరుగుతూ రాగా ఆ తర్వాత తగ్గుతూ వచ్చింది. ఉదయం 6 గంటలకు పుష్కరఘాట్ వద్ద గోదావరి 13.530 మీటర్లు ఉండగా 11 గంటలకు 11. 650 మీటర్ల చేరింది. రెండు గంటలపాటు గోదావరి నీటి ప్రవాహం నిలకడగా కొనసాగగా ఆ తర్వాత క్రమంగా తగ్గుతూ సాయంత్రం 6 గంటలకు పుష్కరఘాట్ వద్ద గోదావరి నీటిమట్టం 13.590 మీటర్లకు చేరి తగ్గుముఖం పడుతోంది. వాజేడు మండలంలో గోదావరి వరద ప్రవాహం కూడా పెరుగుతూ తగ్గుతూ వస్తోంది. పేరూరు వద్ద ఉదయం 8గంటలకు 14.48 మీటర్ల నీటి మట్టంతో ఉన్న గోదావరి 9 గంటలకు 14.51 మీటర్లకు చేరింది. 10గంటలకు 14.52 మీటర్ల నీటిమట్టం పెరిగింది. 11గంటల నుంచి క్రమేణా తగ్గుముఖంపట్టింది. 12 గంటల కు 14.51 మీటర్లు, ఒంటి గంటకు 14.49 మీట ర్లు, 2 గంటలకు 14.47 మీటర్లు, 3 గంటలకు 14.44 మీటర్లు, 4 గంటలకు 14.40 మీటర్లకు చేరుకొని స్వల్పంగా తగ్గుముఖం పట్టింది.



కాళోజీ వర్సిటీ వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

33 జీవోను అమలు చేయాలి..

హెల్త్ యూనివర్సిటీ ఎదుట విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన

వరంగల్ మెడికల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మెడికల్ అడ్మిషన్లలో స్థానికత కోసం తీసుకొచ్చిన జీవో నెంబర్ 33ని తప్పకుండా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ హెల్త్ యూనివర్సిటీ ఎదుట సోమవారం విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మెడికల్ అడ్మిషన్లలో గతంలో 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు 7 ఏళ్లలో నాలుగేళ్లు తెలంగాణ రాష్ట్రంలో చదివిన వారిని లోకల్‌గా పరిగణించేవారు. దీని వల్ల ఇతర రాష్ట్రాల విద్యార్థులు తెలంగాణలో చదవకపోయినా 6,7,8,9 తరగతులు చదివినట్లు తప్పుడు స్టడీ సర్టిఫికెట్లతో అడ్మిషన్లు పొందిన విషయాన్ని ప్రభుత్వం గుర్తించిందన్నారు. తెలంగాణ ప్రాంత విద్యార్థులకు న్యాయం చేయాలనే దృక్పథంతో జీవో 33ని తీసుకువచ్చిందన్నారు. జీవో 33 ప్రకారం స్థానికేతరులుగా పరిగణించబడే 135 మంది కోర్టుకుపోవడం వల్ల తెలంగాణ అడ్మిషన్ల ప్రక్రియలో పాల్గొన్నారు. దీంతో సుమారు 120 మందికిపైగా తెలంగాణ మెడికల్ సీట్లు తెలంగాణేతరులు పొందారని పేర్కొన్నారు. తెలంగాణ విద్యార్థులకు అన్యాయం జరగకుండా జీవో 33ని పకడ్బందీగా అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.

పాత్రికేయులు విశ్లేషణాత్మక

వార్తలు రాయాలి

వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి

వరంగల్ టౌన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పాత్రికేయులు విశ్వసనీయతతో కూడిన విశ్లేషణాత్మక వార్తలు రాయాలని వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి అన్నారు. వరంగల్ హంటర్‌రోడ్డులో గల తాళ్లపద్మావతి స్కూల్లో రాష్ట్ర మీడియా అకాడమీ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు నిర్వహించిన రెండు రోజుల శిక్షణా తరగతులు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జడ్పీ సీఈవో రామిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. నిజనిర్ధారణ అనేది జర్నలిజంలో ఒక భాగమని, జర్నలిస్టులు ఖచ్చితంగా నిజాలను నిర్ధారించుకున్న తర్వాతే వార్తలు రాయాలని సూచించారు. భవిష్యత్తులో పత్రికల నిర్వహణలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రధాన పాత్ర పోషించనుందని అన్నారు. జడ్పీ సీఈవో రామిరెడ్డి మాట్లాడుతూ.. జర్నలిస్టులు సామాజిక మాధ్యమాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, డేటా జర్నలిజం గురించి తెలుసుకోవాలని సూచించారు. అనంతరం జర్నలిస్టులకు ధ్రువపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మీడియా అకాడమీ కార్యదర్శి వెంకటేశ్వరరావు, మేనేజర్ శైలేష్‌రెడ్డి, సీనియర్ జర్నలిస్టులు తోట భావనారాయణ, ఉడుముల సుధాకర్‌రెడ్డి, మార్కండేయ, డీపీఆర్వో ఆయూబ్‌అలీ, తాళ్లపద్మావతి విద్యాసంస్థల చైర్మన్ తాళ్ల మల్లేశం, డైరెక్టర్ వరుణ్, జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

అనితారెడ్డికి ధైర్యదీప్తి అవార్డు

హనుమకొండ కల్చరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని సాయిమీర కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్‌పర్సన్ అనితారెడ్డి ధైర్యదీప్తి అవార్డుతోపాటు ప్రత్యేక ప్రశంసాపత్రాన్ని నిర్వాహకులు బహూకరించి సత్కరించారు. అనితారెడ్డి సామాజిక సేవా, అనాథ పిల్లలకు, దివ్యాంగులకు ఆపన్నహస్తం అందిస్తున్న క్రమంలో ఆమె సేవానిరతిని చాటుతూ ఈ అవార్డును ప్రత్యేకంగా అనితారెడ్డికి అందజేస్తున్నట్లు నిర్వాహకుల పక్షాన సాయిమీర కల్చరల్ సొసైటీ చైర్మన్ పోతనాచారి, కార్యక్రమ కన్వీనర్ ప్రొఫెసర్ తిరుపతయ్యలు తెలిపారు.

ప్రజావాణి ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇవ్వండి

● గ్రేటర్ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ ● ప్రజావాణిలో 109 దరఖాస్తుల స్వీకరణ



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ బాజ్‌పాయ్

వరంగల్ కార్పొరేషన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ ప్రజా వాణి ద్వారా ప్రజలు నుంచి వస్తున్న ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజ ల సమస్యలపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ కోరారు. సోమవారం గ్రేటర్ వరంగల్ మహానగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్‌హాల్‌లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి కమిషనర్ హాజరై ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా చహత్ బాజ్‌పాయ్ మాట్లాడారు. నగర ప్రజలకు అందించవలసిన మౌ లిక సదుపాయాలపై అధికారులు చొరవ చూపాలని అన్నారు. ప్రజావాణి ద్వారా వచ్చిన దరఖాస్తులకు మానవతా దృక్పథంతో పరిశీలించి పరిష్కార మార్గం చూపాలని అన్నారు. ప్రజల నుంచి వచ్చిన వినతులు పెండింగ్‌లో ఉండకుండా చూడాలన్నారు. ప్రధానంగా టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగాల పై వస్తున్న ఫిర్యాదులపై అధికారులు దృష్టి సారించాలన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరిగిన గ్రీవెన్స్‌లో 109 ఫిర్యా దులు స్వీకరించినట్లు కమిషనర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఇంచార్జీ ఎస్ఈ మహేందర్, ఇన్‌చార్జి సీపీ రవీంద్ర రాడేకర్, హెచ్‌వో రమేష్‌తో పాటు వివిధ విభాగాల వింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫిర్యాదులు ఇలా..

● గ్రేటర్ వరంగల్ 43వ డివిజన్ వినాయకనగర్ కాలనీలో చాలా కాలంగా సీసీ రోడ్డు, డ్రైనేజీ లేకపోవడం వల్ల స్థానిక ప్రజల చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై అధికారులకు గతంలో ఫిర్యాదు చేయగా వచ్చి రోడ్డు, డ్రైనేజీ ప్రతిపాదనలు చేసి తిరిగి రాలేదు. అన్ని వర్గాల ప్రజలు ఉండే ఈ కాలనీలో రోడ్లు, డ్రైనేజీలు వేసి సహకరించాలని కాలనీ వెల్ఫేర్ సొసైటీ నాయకులు కమిషనర్‌కు విన్నవించారు.

● మడికొండ 46వ డివిజన్ మెర్సీషాపు నుంచి వెలువడే దుర్గంధం వద్ద ఈగలు, దోమలు ఇండ్లలోకి వస్తున్నాయి, దీనిపై గతంలో అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని మోడెం లావణ్య అనే మహిళ కమిషనర్‌కు ఫిర్యాదు చేసింది. దుర్వాసన వల్ల ఇప్పటికే రోగాల బారిన పడుతు న్నామని, అధికారులు స్పందించా లని కోరింది.

● వరంగల్ 36వ డివిజన్ అబ్బనికుంట మైసమ్మ నుంచి స్టేష న్‌కు వెళ్లే రోడ్డు కాల్వలు తీసి కాంట్రాక్టర్ వదిలివేయడంతో రెండు మాసాలుగా నల్లా నీరు రావడం లేదని పుప్పాలగుట్ట ప్రాంతానికి చెందిన సుమారు 50 మంది కమి షనర్‌కు ఫిర్యాదు చేశారు. సదరు కాంట్రాక్టర్‌ను పిలిపించి తీసిన మట్టిని పూడ్చి వేసి ప్రతీ ఇంటికి నల్లాలు వచ్చే విధంగా చొరవ చూపాలన్నారు.

● ఏనుమాముల నుంచి నర్సంపేట రోడ్డు వరకు శాశ్వత రోడ్డు నిర్మాణం చేపట్టాలని కాలనీ వాసులు కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. గ్రీన్‌సిటీ లేఔట్, గరీబ్‌నగర్, కీర్తినగర్‌ల నుంచి వచ్చే మురికినీరు కాలనీలలోని ఇండ్ల చుట్టుపక్కల నిలిచి ఉండడం వల్ల చాలా అసౌకర్యంగా ఉందని, పరిష్కార మార్గం చూపాలని కమిషనర్‌కు వినతిపత్రం అందించారు.

ఫిర్యాదులు ఇలా..

ఇంజనీరింగ్	- 30
హెల్త్, శానిటేషన్	- 09
ప్రాపర్టీ ట్యాక్స్, రెవెన్యూ	- 10
టౌన్‌ప్లానింగ్	- 49
తాగునీటి సరఫరా	- 05
హార్టికల్చర్	- 02
ఎలక్ట్రికల్	- 05
మొత్తం=	**109**

దోచుకున్నది కల్వకుంట్ల కుటుంబమే..

● బీజేపీలో విలీనంపై ఎందుకు స్పందించడం లేదు?
● వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి

హనుమకొండ టౌన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రపాలకుల కంటే తెలంగాణ రాష్ట్ర సంపదను దోచుకున్నది కల్వకుంట్ల కుటుంబమేనని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీలో విలీనం కానున్న బీఆర్ఎస్ పార్టీని మైనారిటీ నాయకులు నమ్మవద్దని సూచించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి, కాంగ్రెస్ ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధిపై కేటీఆర్ చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. చర్చలో తాను ఒక్కడినే వస్తానని, దమ్ముంటే చేసిన అభివృద్ధిని నిరూపించుకోవాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం చేస్తున్న అభివృద్ధిని కేటీఆర్ అడ్డుకునే విధంగా మాట్లాడుతున్నాడని అన్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీకోసం బీఆర్ఎస్ నాయకులు 300మంది వద్ద ఒక్కొక్కరి నుంచి రూ.3లక్షల చొప్పున వసూలు చేశారని ఆరోపించారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను వచ్చే నెల 15లోపు అర్హులకు పంపిణీ చేస్తామని తెలిపారు.

బతుకమ్మ బ్రాండ్ అంబాసిడర్‌గా చెప్పుకున్న ఎమ్మెల్సీ కవిత.. లిక్కర్ స్కామ్ చేయడం మహిళలకే కలంకంగా మారిందని ఎమ్మెల్యే నాయిని దుయ్యబట్టారు. మామునూరు ఎయిర్‌పోర్టుకు క్లియరెన్స్ తెచ్చుకోలేని దద్దమ్మలు బీఆర్ఎస్ నాయకులని విమర్శించారు. కాళేశ్వరం నిర్మించిన వాళ్లే మళ్లీ నిర్మాణం చేపట్టాలని చెప్పడం వారు చేసిన అవినీతికి నిదర్శనమన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయంతో వరంగల్ జిల్లాను ఆరు ముక్కలు చేశారని అన్నారు. పశ్చిమ నియోజక వర్గంలోని 29, 11వ డివిజన్లు వరంగల్ జిల్లాలో కలిశాయని, దీంతో సంక్షేమ పథకాల అమలులో ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్‌ఖాన్, ఈవీ శ్రీనివాస్, బత్తిని శ్రీనివాస్, హనుమకొండ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళ సంపత్ యాదవ్, కార్పొరేటర్ వేముల శ్రీనివాస్, లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ వైద్యులపై కేసు నమోదు

వరంగల్ మెడికల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ కేయూ పోలీసు స్టేషన్‌లో ముగ్గురు నకిలీ వైద్యులపై కేసులు నమోదు అయినట్లు తెలంగాణ మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రార్ డాక్టర్ లాలయ్య కుమార్ తెలిపారు. భీమారం ప్రాంతంలోని ఇందిరా గాంధీ విగ్రహం వద్ద సిరి ఫస్ట్ ఎయిడ్ క్లినిక్ నిర్వాహకుడు బి.కృష్ణ ప్రసాద్ (ల్యాబ్ టెక్నీషియన్), శ్రీ బాలాజీ క్లినిక్ నిర్వాహకుడు ఆర్.శ్రీకాంత్ (ల్యాబ్ టెక్నీషియన్), జవహర్ నగర్ ప్రాంతంలో మై హెల్త్ హాస్పిటల్ నిర్వాహకుడు కె.శరత్‌కుమార్ (బిఫార్మసీ, ప్రభుత్వ ఉద్యోగి)లు ఎలాంటి అర్హత లేకున్నా వైద్యం నిర్వహిస్తుండటంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ముగ్గురిపై ఎన్ఎంసీ చట్టం 34 54 టీఎస్ ఎంపీఆర్ చట్టం 22, బీఎన్ఎస్ 318, 319 ప్రకారం కేసు నమోదు అయినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ లాలయ్య కుమార్, చైర్మన్ డాక్టర్ కె.నరేశ్ కుమార్‌లు మాట్లాడుతూ.. ఎలాంటి అర్హత లేకుండా అలోపతి, మోడర్న్ మెడిసిన్ వైద్య సేవలు అందించవద్దని, ప్రథమ చికిత్స ముసుగులో ఇష్టం వచ్చినటు వైద్యం చేస్తే చట్ట ప్రకారం ఒక యేడాది జైలుశిక్ష, రూ.5లక్షల వరకు జరిమానా విధించనున్నట్లు తెలిపారు. 9154382727కు నకిలీ వైద్యుల గురించి సమాచారం అందించాలని తెలిపారు.

గడ్డిమందు తాగి

ఆత్మహత్యాయత్నం

నర్సంపేట టౌన్, జూలై 28(ఆంధ్రజ్యోతి): గడ్డి మందు తాగి ఒకరు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన నర్సంపేట మండలం మహేశ్వరం గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలిలావున్నాయి. మహేశ్వరం గ్రామానికి చెందిన చిదురాల వీరస్వామి భార్య నాలుగేళ్ల కిందట అనారోగ్యంతో, కుమారుడు మూడేళ్ల కిందట ఉరివేసుకొని మృతి చెందాడు. దీంతో ఇదే గ్రామానికి చెందిన దివ్యాంగురాలైన కందకట్ల రాధికను ఏడాది కిందట వీరస్వామి వివాహం చేసుకున్నాడు. రాధిక పేరు మీద ఉన్న ఒక ఎకరం ఆరు గుంటల భూమిని సాగు చేసుకుంటూ వీరస్వామి, రాధిక దంపతులు జీవనం కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో వీరస్వామి నర్సంపేట పట్టణానికి చెందిన ఇద్దరు మధ్యవర్తుల సహాయంతో అప్పు కోసం ప్రయత్నించే సందర్భంలో ఏకంగా తన భూమిని అప్పు ఇస్తానన్న మహిళ పేరుపై రిజిస్ట్రేషన్ చేయించుకుంది. ఈ విషయంపై గ్రామంలో పలుమార్లు పంచాయితీలు జరిగినా తన పేరుపై రిజిస్ట్రేషన్ అయిన భూమిని వీరస్వామికి ఇవ్వనని ఆ మహిళ చెప్పింది. దీంతో మనస్తాపానికి గురైన వీరస్వామి సోమవారం ఇంట్లో ఉన్న గడ్డి మందును సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడడడంతో అపస్మారక స్థితిలో ఉన్న వీరస్వామిని కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఈ విషయంపై నర్సంపేట పోలీసులను అడుగగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తి అరెస్ట్

● రూ.15 లక్షల విలువ చేసే 30 కిలోల సరుకు స్వాధీనం ● వివరాలు వెల్లడించిన కాజీపేట ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి



నిందితుడి అరెస్టు చూపుతున్న కాజీపేట ఏసీపీ పింగిళి ప్రశాంత్‌రెడ్డి

హసన్‌పర్తి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా చేస్తున్న నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి అతడి వద్ద సుమారు రూ.15,14,500 విలువ చేసే 30.290 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. హసన్‌పర్తి పోలీసుస్టేషన్‌లో సోమవారం ఇన్‌స్పెక్టర్ వట్టె చేరాలు ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కాజీపేట ఏసీపీ పింగిళి ప్రశాంత్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. ఒడిశా రాష్ట్రంలోని గజపతి జిల్లా, మోహన తాలూక, కర్నాబడికి చెందిన ఆశిష్‌కుమార్ నాయక్ అలియాస్ లిపునాయక్ (27) కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. దీంతో ఆయనకు వచ్చే ఆదాయం సరిపోక అక్రమంగా డబ్బులు సంపాదించాలనుకున్నాడు. సుమారు 6 ఏళ్ల కిందట అతడికి పరిచయస్తుడైన చాందిపుట్‌కు చెందిన జమీర్‌తో గంజాయి రవాణా చేస్తూ ఒరిస్సాలో పోలీసులకు పట్టుబడి సర్కిల్ జైలులో 9 నెలల జైలు శిక్ష అనుభవించాడు. అయినప్పటికీ అతడిలో మార్పు రాలేదు. జైలు నుంచి తిరిగి వచ్చిన తరువాత ఒరిస్సాలోని గజపతి జిల్లా, గండపదర్‌కు చెందిన ప్రశాంత్ మాలిక్ వద్ద ఒక కిలో గంజాయి రూ.1500లకు కొనుగోలు చేసి మహారాష్ట్రలోని షోలాపూర్‌కు చెందిన మహదేవ్ కాలేకు రూ.4500లకు అమ్మి లాభం పొందేవాడు.

ఇదే క్రమంలో ఈనెల 24న ప్రశాంత్ మాలిక్ వద్ద 30.290 కిలోల ఎండు గంజాయిని కొనుగోలు చేశాడు. ఎవరికీ అనుమానం రాకుండా వాటిని ఒక్కో పాకెట్ 2 కిలోల చొప్పున 15 పాకెట్లుగా తయారు చేసి లగేజీ బ్యాగులలో సర్దుకున్నాడు. 25న పదిహేను పాకెట్లను రెండు లగేజీ బ్యాగులలో తీసుకొని ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్‌కు వచ్చి కోనార్క్ ఎక్స్‌ప్రెస్ ఎక్కి 26న వరంగల్ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నాడు. రైల్వేస్టేషన్‌లో పోలీసు వారి తనిఖీలను చూసి ఎవరికీ అనుమానం రాకుండా అక్కడి నుంచి తప్పించుకొని వరంగల్ చుట్టు పక్క ఏరియాలో రెండు రోజులు గడిపాడు. అనంతరం 28న వరంగల్ రైల్వే స్టేషన్‌లో పోలీసు తనిఖీలు చేస్తున్నారని తెలుసుకొని ఉదయం మహారాష్ట్రకు వెళ్లుటకు మరో రైల్వే స్టేషన్ కోసం ఆరా తీశాడు. దీంతో హసన్‌పర్తిలోని ఎల్లాపూర్ రైల్వే స్టేషన్ అనువుగా ఉందని తెలుసుకొని ఆటోలో రైల్వే బ్రిడ్జి దగ్గర దిగి రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలోనే గ్రామంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న ఎస్సై దేవేందర్‌తో పాటు పోలీసు సిబ్బందిని చూసి ఆశిష్‌కుమార్ పారిపోయే ప్రయత్నం చేశాడు. దీంతో అనుమానం వచ్చిన పోలీసు సిబ్బంది అతన్ని పట్టుకొని సుమారు రూ.15,14,500 విలువ చేసే 30.290 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. గంజాయి పట్టుకోవడంలో ప్రతిభకనబర్చిన ఎస్సై దేవేందర్ పోలీసు సిబ్బందిని ఏసీపీ అభినందించారు. ఈ సమావేశంలో ఎస్సైలు శీలం రవిందర్, సుజిత్‌రెడ్డి, క్రైం కానిస్టేబుల్ క్రాంతి కుమార్, ప్రకాష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి బొగత సందర్శనకు అనుమతి

వాజేడు, జూలై 28(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లాలోని బొగత జలపాత సందర్శనకు పర్యాటకులను అనుమతిస్తున్నట్లు ఎఫ్ఆర్‌వో చంద్రమౌళి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారీ వర్షాల నేపథ్యంలో ఈ నెల 23 నుంచి బొగత సందర్శనను అధికారులు నిలిపివేశారు. దీంతో వందల సంఖ్యలో వచ్చిన పర్యాటకులకు నిరుత్సాహం తప్పలేదు. ప్రస్తుతం వర్షాలు, బొగత వరద నీరు తగ్గడంతో జలపాతం సందర్శనకు అనుమతిచ్చారు. కేవలం సందర్శకులు జలపాతాన్ని చూడ్డానికి మాత్రమే రావాలని, ఈత కొలనులో దిగి స్నానాలు చేయటానికి అనుమతి లేదని అధికారులు ప్రకటించారు. ఇది ఇలా ఉండగా బొగత సందర్శన అనుమతులపై అధికారుల ప్రకటనలు గందరగోళానికి దారితీశాయి. జిల్లాలోని జలపాతాలకు అనుమతులు లేవని ఉన్నతాధికారులు ఆదివారం ప్రకటించారు. ఇదే క్రమంలో స్థానిక ఫారెస్టు అధికారులు మాత్రం మరో ప్రకటనలో జలపాతం సోమవారం నుంచి సందర్శనకు అనుమతిస్తున్నట్లు ప్రకటించారు. దీంతో పర్యాటకులు అయోమయానికి గురవుతున్నారు.



సర్వేలన్నీ బీఆర్ఎస్ వైపే..

అత్యధిక స్థానాలు మనమే గెలుస్తాం: ఎర్రబెల్లి దయాకర్‌రావు



కొడకండ్లలో ఎర్రబెల్లి దయాకర్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన గంగపుత్ర కులస్తులు

పాలకుర్తి(కొడకండ్ల) జూలై 28(ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలు బీఆర్ఎస్ పార్టీ గెలుస్తుందని సర్వేలు చెబుతున్నాయని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. సోమవారం జనగామ జిల్లా కొడకండ్ల మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కొడకండ్ల రెండు ఎంపీటీసీ స్థానాల క్లస్టర్ల సన్నాహక సమావేశం జరుగగా ముఖ్య అతిథిగా మాజీ మంత్రి దయాకర్‌రావు హాజరై మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420 హామీలతో ప్రజలు మోసపోయారన్నారు. తెలంగాణలో బ్లాక్‌మెయిలర్ చేతిలో ప్రభుత్వం ఉందని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని రైతు భరోసా నిధులు విడుదల చేసిందన్నారు. ప్రజలు, నిరుద్యోగ యువకులు, మహిళలు స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వస్తాయని చూస్తున్నారని తెలిపారు. నమ్ముకున్న నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటానని అన్నారు. రేవంత్‌రెడ్డి పాలనపై ప్రజలు అసంతృప్తితో ఉన్నారని విమర్శించారు. అనంతరం కొడకండ్లకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు గంగపుత్ర కులస్తులు సింగారం ధర్మేందర్, శ్రీనివాస్, కొప్పు వెంకటయ్య, హరీష్, గోదుమల రవి, వెంకటయ్యలు బీఆర్ఎస్‌లో చేరగా, ఎర్రబెల్లి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. సమావేశానికి సిందే రామోజీ అధ్యక్షత వహించగా, కొడకండ్ల మండల ఇన్‌చార్జి బబ్బూరి శ్రీకాంత్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. కార్యక్రమంలో నాయకులు మోహన్‌గాంధీ నాయక్, పేరం రాము, దీకొండ వెంకటేశ్వర్‌రావు ఉన్నారు.

శైవక్షేత్రాలను సందర్శించే భక్తుల కోసం ప్రత్యేక బస్సులు

హనుమకొండ టౌన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం సందర్భంగా శైవ క్షేత్రాలను సందర్శించే భక్తుల కోసం పంచారామ దర్శన యాత్రకు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సులు ఏర్పాటు చేసినట్లు సోమవారం ఆర్ఎం డి.విజయభాను ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 3న హనుమకొండ బస్టాండ్ నుంచి బస్సు ప్రారంభమై ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పంచారామ క్షేత్రాలు అమరావతి, అమరలింగేశ్వర స్వామి, భీమవరం శ్రీసోమేశ్వర స్వామి, సామర్లకోట భీమేశ్వర స్వామి దర్శించుకోవచ్చని తెలిపారు. ఈ యాత్ర ఆగస్టు 3న ఆదివారం తిరిగి మంగళవారం హనుమకొండకు బస్సు చేరుకుంటుందని తెలిపారు. పెద్దలకు బస్సు టికెట్ ధర ఒకరికి రూ.2300, పిల్లలకు రూ.1400 ఉంటుందని, ఈ అవకాశాన్ని భక్తులు వినియోగించుకోవాలని పూర్తి సమాచారం కోసం సెల్ నంబర్లు : 9063407493 / 7780565971 / 9866373825 / 9959226047 లకు సంప్రదించాలని ఆర్ఎం విజయభాను ప్రకటనలో పేర్కొన్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు	2305	1521
పల్లికాయ (సూక)	5900	3450
పల్లికాయ (పచ్చిది)	5200	1575
కందులు	6100	3022
పెసళ్లు	7052	3022
పత్తి	7820	5300
పసుపు (కాడి)	10599	9534
పసుపు (గోల)	10070	8700
తేజ మిర్చి	10000	8500
తేజ ఏసీ	13200	11500
వండర్‌హాట్	10500	6000
వండర్‌హాట్ ఏసీ	14000	11500
యూఎస్341ఏసీ	13000	7000
దీపిక	9000	8000
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	5000	3000

- వరంగల్ వ్యవసాయం

ఆరోగ్యంతో చెలగాటం



- నగరంలో ఇష్టారాజ్యంగా హోటళ్లు, టిఫిన్ సెంటర్ల తీరు
- కల్తీ పదార్థాలతో ఆటలాడుతున్న నిర్వాహకులు
- అపరిశుభ్ర వాతావరణంలో వంటశాలలు, పదార్థాలు
- నిల్వ చేసిన ఆహార పదార్థాలకు కెమికల్స్ జోడింపు
- కల్తీ ఆహారం తిని వ్యాధుల బారిన పడుతున్న ప్రజలు
- జీడబ్ల్యూఎంసీలో ఫుడ్‌సేఫ్టీ వింగ్ జాడేది?

వరంగల్ కార్పొరేషన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ నగరంలో ఆహార పదార్థాల తయారీలో నాణ్యత కొరవడుతోందనే ఆరోపణలున్నాయి. హోటళ్లు, రెస్టారెంట్లు, టిఫిన్, ఫాస్‌ఫుడ్ సెంటర్లలో నిల్వ చేసిన ఆహారాన్ని వడిస్తున్నట్లు తెలుస్తోంది. అందమైన, ఆకర్షణీయమైన భవనాలలో హోటళ్ల నడుపుతున్న నిర్వాహకులు.. ఆహార పదార్థాల తయారీలో శుచి, శుభ్రత పాటించడం లేదనే విమర్శలున్నాయి. కలుషితమైన ఆహారాన్ని వడ్డిస్తూ వినియోగదారుల ఆరోగ్యాలతో చెలగాట మాడుతున్నట్లు తెలుస్తోంది. కొందరు హోటళ్ల యజమానులు ప్రభుత్వ నిబంధనలు పక్కనబెట్టి కెమికల్స్‌తో కూడిన కల్తీ ఆహారాన్ని అందిస్తుండడంతో ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోంది.

ఫుడ్ హబ్‌గా..

వరంగల్ నగరానికి హైదరాబాద్ తర్వాత రెండో రాజధానిగా పేరుంది. ఈ ప్రాంతం రోజు రోజుకూ అభివృద్ధి చెందుతూ పర్యాటక, విద్య, వాణిజ్య కేంద్రంగా ప్రసిద్ధి చెందుతోంది. ఈక్రమంలో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన పర్యాటకులు సైతం ఇక్కడి 5 స్టార్స్, 3 స్టార్స్ హోటళ్లలో సేద తీరుతారు. వరంగల్ నగరంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో కోట్ల రూపాయల ఆహార వ్యాపారం జరుగుతోంది. అలాగే వరంగల్ నగరంలో రుచికరమైన ఆహార పదార్థాలు విరివిగా లభిస్తుంటాయి. అయితే కొన్ని ఆహార కేంద్రాల్లో ప్రమాణాలు పాటించడం లేదనే విమర్శలున్నాయి. ధనార్జనే ధ్యేయంగా కల్తీ ఆహారాన్ని అందిస్తూ ప్రజల ఆరోగ్యాలతో ఆటలాడుకుంటున్నట్లు ఇటీవల చోటుచేసుకున్న ఘటనలు చెబుతున్నాయి. కొన్ని పేరు మోసిన రెస్టారెంట్లలో కిలోల కొద్ది మటన్, చికెన్, చేపలు, ప్రాన్స్, గుడ్లు, పిండి పదార్థాలకు విషపూరితమైన కెమికల్స్ అద్ది నిల్వ చేస్తున్నారు. చాలా రోజులుగా ఫ్రీజ్‌లలో నిల్వ చేసిన ఆహార పదార్థాలను జనాలకు పెట్టి వారి ఆరోగ్యాలతో చెలగాట మాడుతున్నారు.

నిబంధనలు గాలికి..

వరంగల్ నగరంతో పాటు చుట్టుపక్కల కొన్ని హోటళ్లు, రెస్టారెంట్లు, దాబాలలో నిర్వాహకులు కనీస నిబంధనలు పాటించడం లేదు. జిడ్డుతో నల్లగా ఏర్పడిన వంట గది గోడలు, వంట పాత్రలు, శుద్ధిలేని నీరు, పాడైపోయిన వంట నూనె, గతంలోవంటకు ఉపమోగించిన ఆయిల్, ఎక్కువ రోజులు నిల్వ చేసిన మాంసం, చేపలు, కాలం చెల్లిన వంట పదార్థాలు, కుళ్లిపోయిన కూరగాయలు చాలా చోట్ల హోటళ్లలో కనిపిస్తున్నాయి.

మటన్, చికెన్‌తో పాటు కలిపి పెట్టిన వంట పదార్థాలు కుళ్లిపోకుండా ప్రమాదకర కెమికల్స్ వాడుతున్నారు. చాలా హోటళ్లలో పెద్దపెద్ద ఫ్రిజ్‌లలో క్వింటాళ్ల కొద్ది మాంసం నిల్వచేసి ఉంచుతున్నా పట్టించుకున్న వారు లేరు. హోటళ్లకు ఒక్కసారిగా ఎంత మంది కస్టమర్లు వచ్చినా అప్పటి కప్పుడు ఫ్రిజ్‌లో పెట్టిన ఆహారాన్ని అరగంటలో అందిస్తూ అందిన కాడికి దండుకుంటున్నారు.

గ్రేటర్ పరిధిలో హోటళ్ల లెక్క	
హోటళ్లు	829
టిఫిన్ సెంటర్లు	659
బార్ అండ్ రెస్టారెంట్లు	123
బేకరీలు	360
స్ట్రీట్ ఫుడ్ సెంటర్లు	1280
ఫుడ్ వ్యాన్లు	140
ఐస్‌క్రీస్ పార్లర్లు	89



తనిఖీలు ఏవీ?

పుట్టగొడుగుల్లా వెలుస్తున్న హోటళ్లు, రెస్టారెంట్లపై ఆహార నియంత్రణ శాఖ అధికారులు దృష్టి సారించకపోవడంతో ఆడిందే ఆటగా సాగుతోంది. ఫుడ్ సేఫ్టీ అధికారులు, మునిసిపల్ సిబ్బంది దాడులు చేసినా నిర్వాహకుల ప్రవర్తనలో మార్పు రావడం లేదు. నిర్వాహకులు ఉన్నతాధికారులను మేనేజ్ చేస్తూ విషయం బయట పడకుండా జాగ్రత్త పడ్డారు. కొన్ని హోటళ్లు, రెస్టారెంట్లు, కర్రీ పాయింట్ల వంటశాలలు అపరిశుభ్రంగా కనిపించడం చూసి నామమాత్రపు జరిమానాలు విధిస్తున్నారు. వరంగల్ మునిసిపల్ పరిధిలోని కొన్ని బడా హోటళ్లు, లాడ్జీలు, రెస్టారెంట్లు, బార్లు కొందరు ప్రజాప్రతినిధుల కనుసన్నల్లో నడుస్తుండడంతో అధికారులు సైతం చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

కబేళాకు వెళ్లకుండానే మాంసం

వరంగల్ నగరంలో ఉన్న 829 హోటళ్లు, రెస్టారెంట్లలో సొంతంగా కోసిన మటన్, చికెన్ వినియోగిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వరంగల్, హనుమకొండ, కాజీపేట ప్రాంతాల్లో ఉన్న కబేళాలో అన్ని రకాల పరీక్షలు చేసిన తర్వాత జంతువులను వధిస్తారు. తర్వాత జీడబ్ల్యూఎంసీ ముద్ర తొంటికి వేసి మాంసాన్ని విక్రయించేందుకు అనుమతులు ఇస్తారు. కానీ, కొందరు నిర్వాహకులు నిబంధనలు పాటించకుండా నగరం చుట్టుపక్కల వ్యాధుల బారిన పడిన మేకలు, గొర్రెలు తెచ్చి హోటళ్ల సమీపంలో వధించి యధేచ్ఛగా ఆహార విక్రయాలు జరుపుతున్నారు. ఇదంతా సంబంధిత శాఖకు, జీడబ్ల్యూఎంసీ అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదనే ప్రచారం ఉంది.

గ్రేటర్‌లో ఫుడ్‌సేఫ్టీ విభాగం ఏదీ?

గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధి 66 డివిజన్లకు విస్తరించినా ఆహార కల్తీ నియంత్రించేందుకు ఒక్కరు కూడా లేకపోవడం విచారకరం. గతంలో ఎమ్మెస్సీ ఫుడ్ అండ్ న్యూట్రీషన్ కోర్సు చదివిన ఇద్దరు అధికారులు పని చేసేవారు. ఇక్కడి పరిస్థితులు నచ్చక తిరిగి వెనక్కి వెళ్లినట్టు తెలిసింది, దీంతో పదేళ్లుగా జీడబ్ల్యూఎంసీకి ఫుడ్ సేఫ్టీ విభాగం లేకపోవడంతో నగరంలో హోటళ్ల కల్తీకి రెక్కలొచ్చాయి. ప్రజా ఫిర్యాదులు అందినప్పుడే శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు తూతూ మంత్రంగా తనిఖీ చేసి నామమాత్రపు జరిమానాలు విధిస్తున్నారు. తర్వాత నెలవారి గార్బే జ్ (చెత్త) పేరుతో అధిక వసూళ్లకు పాల్పడుతున్నట్టు తెలిసింది. అయితే ప్రస్తుతం శానిటేషన్ విభాగంలో ఫుడ్ అండ్ న్యూట్రీషియన్ కోర్సు పూర్తి చేసిన సిబ్బంది ఉన్నా వారికి అవకాశం ఇవ్వడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

ఆరోగ్య శాఖ సూచనలు ఇలా..

- ప్రతీ హోటల్ నిర్వాహకుడు ఎఫ్ఎస్ఎస్ఐ లైసెన్స్ కలిగి ఉండాలి.
- వంట పనుల్లో శుభ్రమైన నీటిని వాడాలి.
- వంటగది, ప్లేట్లు, టేబుళ్లు, పరిసరాలు శుభ్రంగా ఉండాలి.
- పదార్థాల నిల్వ పద్ధతులు శాస్త్రీయంగా ఉండాలి.
- వంట మనుషులకు ప్రతీ నెల ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలి.
- వంట మనుషులు, సర్వీస్ చేసేవారు తప్పకుండా గ్లౌజులు, మాస్కులు, క్యాపులు ధరించాలి.
- ఫుడ్ ప్యాకింగ్ డెలివరీలో హైజీన్ పాటించాలి.
- సమస్యలు ఉంటే టోల్‌ఫ్రీ నెంబర్ 1800 11 2100 లేదా 9643987222 నెంబర్‌కు ఆహార కల్తీ ఫొటోలు పంపిస్తే దర్యాప్తు చేసి సమస్య పరిష్కరిస్తారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి..



నగరంలోని హోటళ్లు, రెస్టారెంట్లు, ఆహార పదార్థాలు ఉత్పత్తి చేసి అందించే వారు ప్రభుత్వ నిబంధనలు పాటించాలి. వేడినీటితో ప్లేట్లు, ఆహార పదార్థాలు శుభ్రం చేయాలి. వ్యర్థనీరు వెళ్లేందుకు సరైన మార్గం కలిగి ఉండాలి. విక్రయించగా మిగిలిన వస్తువులు, ఆహార పదార్థాలు నిల్వ ఉంచకూడదు. హోటళ్ల, రెస్టారెంట్ల నిర్వాహకులు గ్లౌజులు, మాస్కులు, టోపీలు తప్పకుండా వాడాలి. ప్రభుత్వ నిబంధనలు పాటించని వారిపై చర్యలు చేపడతాం.

– డాక్టర్ బొమ్మన రాజారెడ్డి, జీడబ్ల్యూఎంసీ సీఎంహెచ్‌వో

ఆయుర్వేద వైద్య కళాశాలల్లో సీట్లకు గండి

- మూడు బోధన ఆస్పత్రుల్లో సిబ్బంది, వసతుల కొరత
- రెండు కళాశాలల్లో సీట్ల తగ్గింపునకు పొంచి ఉన్న ప్రమాదం
- గత ఏడాది వరంగల్‌లో నాలుగు సీట్లకు కోత
- 2009 నుంచి కండీషన్ అనుమతులతోనే బీఏఎంఎస్ ప్రవేశాలు
- సీఎం సారూ.. ఆయుర్వేద వైద్య విద్యను కాపాడండి..

గిర్మాజీపేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : ఆయుర్వేద వైద్య విద్యపై ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా రాష్ట్రంలో ఉన్న రెండు ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాలల్లో ఈ ఏడాది బీఏఎంఎస్ సీట్లకు గండిపడే ప్రమాదం ఏర్పడింది. రెండు ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాలలు, వీటికి అనుబంధంగా ఉన్న మూడు బోధన ఆస్పత్రుల్లో సిబ్బంది, మౌలిక సదుపాయాల కొరతతో ఆయుర్వేద వైద్య విద్య డోలాయమాన నపరిస్థితిని ఎదుర్కుంటోంది. నేషనల్ కమిషన్ ఫర్ ఇండియన్ సిస్టమ్ ఆఫ్ మెడిసిన్(ఎన్‌సీఐఎస్‌ఎం) ప్రమాణాలు, నిబంధనలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. గత ఏడాది వరంగల్ ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల నాలుగు బీఏఎంఎస్ సీట్లు కోల్పోగా, ఈ ఏడాది మరెన్ని సీట్లకు గండిపడుతుందోననే ఆందోళన విద్యార్థులు, తల్లి దండ్రుల్లో వ్యక్తమవుతోంది.

వరంగల్ జిల్లా కేంద్రంలోని అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాలలో బీఏఎంఎస్ 63 సీట్లు, హైదరాబాద్‌లోని బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాలలో బీఏఎంఎస్ 63 సీట్లు, పీజీలో 49 సీట్లు ఉన్నాయి. జాతీయ స్థాయిలో నిర్వహించే నీట్ ప్రవేశ పరీక్ష మెరిట్ ఆధారంగా ఎంబీబీఎస్ తరహాలోనే బీఏఎంఎస్‌కు ప్రవేశాలు జరుగుతాయి. ఎంబీబీఎస్, బీడీఎస్ తరువాత బీఏఎంఎస్(బ్యాచులర్ ఆఫ్ ఆయుర్వేద మెడిసిన్ అండ్ సర్జరీ)కు విద్యార్థులు ప్రాధాన్యత ఇస్తారు. ఆయుర్వేద వైద్య విద్య ప్రమాణాలు, నిబంధనలను నేషనల్ కమిషన్ ఆఫ్ ఇండియన్ సిస్టమ్ ఆఫ్ మెడిసిన్(ఎన్‌సీఐఎస్‌ఎం) నిర్దేశిస్తూ ఆయుర్వేద వైద్య విద్యను పర్యవేక్షిస్తుంటుంది. దేశంలోని ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాలల్లో అవసరమైన బోధన, బోధనేతర సిబ్బంది, అనుబంధ బోధన ఆస్పత్రుల్లో అవసరమైన వైద్యులు, పారామెడికల్, నాల్గవ తరగతి సిబ్బందితో పాటు వైద్య కళాశాలలు, ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాలు ఎన్‌సీఐఎస్‌ఎం ప్రమాణాల మేరకు ఉంటేనే ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాలల్లో బీఏఎంఎస్ సీట్లకు ఎన్‌సీఐఎస్‌ఎం అనుమతి ఇస్తుంది. ఇందుకు గాను ప్రతి సంవత్సరం అక్టోబరు, నవంబరులో ఎన్‌సీఐఎస్‌ఎం బృందం ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాలలు, ఆస్పత్రులను తనిఖీ చేసి తగిన సిబ్బంది, మౌలిక సదుపాయాలను ప్రత్యక్షంగా పరిశీలించి ప్రవేశాలకు అనుమతులు ఇస్తుంది.



వరంగల్ అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల

రాష్ట్ర ప్రభుత్వం ఆయుర్వేద వైద్య విద్యపై సవతి తల్లి ప్రేమను చూపుతూ ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాలలు, ఆస్పత్రుల్లో నియామకాలు చేపట్టక పోవడం, మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో తెలంగాణలో ఆయుర్వేద వైద్య ప్రమాదంలో పడిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎన్‌సీఐఎస్‌ఎం బృందాలు తనిఖీకి వచ్చినపుడు సిబ్బంది, మౌలిక సదుపాయాలు తప్పనిసరిగా కల్పిస్తామంటూ రాష్ట్ర ప్రభుత్వం హామీ పత్రాలు ఇస్తుండటంతోనే ప్రవేశాలకు అమతులు లభిస్తున్నాయి. ఎన్‌సీఐఎస్‌ఎం కండీషన్‌లతోనే 2009 నుంచి గత విద్యా సంవత్సరం (2024-25) వరకు రాష్ట్రంలో బీఏఎంఎస్ ప్రవేశాలు జరిగాయి. అయితే రాష్ట్ర ప్రభు త్వం తమ హామీలను అమలు చేయకపోవడంతో గత విద్యా సంవత్సరం లో వరంగల్ అనంతలక్ష్మి ప్రభుత్వ వైద్య కళాశాలలో నాలుగు బీఏఎంఎస్ సీట్లను ఎన్‌సీఐఎస్ తగ్గించింది. దీంతో గత ఏడాది నలుగురు విద్యార్థులు ఆయుర్వేద వైద్య విద్యను చదువుకోలేక పోయారు. ప్రభుత్వం ఆయుర్వేద వైద్యంపై పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తుండటంతో హైదరాబాద్‌లోని చార్మినార్, ఎర్రగడ్డ, వరంగల్ ప్రభుత్వ ఆయుర్వేద బోధన ఆస్పత్రుల్లో కనీసం పారిశుధ్య సిబ్బంది లేని పరిస్థితి నెలకొంది.

వరంగల్ ప్రభుత్వ ఆయుర్వేద కాలేజిలో 44 పోస్టులు ఖాళీ

వరంగల్‌లోని అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాలలో బోధన, బోధనేతర సిబ్బందితో కలిపి మొత్తం 67 సాంక్షన్ పోస్టులు ఉండగా, 44 ఖాళీలు ఉన్నాయి. ఇందులో ప్రిన్సిపాల్ 01 పోస్టు, ప్రొఫెసర్లు 04, అసిస్టెంట్ ప్రొఫెసర్లు 07, లెక్చరర్లు 15, లైబ్రేరియన్ 01, ఆఫీసు సూపరింటెండెంట్ 01, ల్యాబ్ టెక్నీషియన్ 04 పోస్టులతో పాటు ఇతర పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అలాగే డిపార్టుమెంట్‌లలో అవసరమైన పరికరాలు, తరగతి గదులు, లైబ్రరీలో పుస్తకాలు, లెక్చరర్ హాల్, హాస్టల్స్‌లో మౌలిక సదుపాయాల కొరత తీవ్రంగా ఉంది.

హైదరాబాద్ బీఆర్‌కేఆర్ ప్రభుత్వ కాలేజీలో బోధన పోస్టులు 42 ఖాళీ

హైదరాబాద్‌లోని బీఆర్‌కేఆర్ ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాలలో ప్రిన్సిపాల్ పోస్టుతో పాటు 42 బోధనపోస్టులు ఖాళీగా ఉన్నాయి. అండర్ గ్రాడ్యుయేట్ విభాగంలో 25, పోస్టు గ్రాడ్యుయేట్ విభాగంలో 17 బోధన పోస్టులు సంవత్సరాలుగా ఖాళీగా ఉన్నాయి. ఇందులో పీజీ ప్రొఫెసర్ పోస్టులు 02, రీడర్ 01, సీనియర్ లెక్చరర్స్ 07, టెక్నికల్ అసిస్టెంట్స్ 07 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అండర్ గ్రాడ్యుయేట్ ప్రొఫెసర్ 03, అసిస్టెంట్ ప్రొఫెసర్ 07, లెక్చరర్స్ 15 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటితో పాటు నాన్‌టీచింగ్‌లో 65 సాంక్షన్ పోస్టులకు గాను 41 ఖాళీగా ఉన్నాయి.

వరంగల్ ఆయుర్వేద బోధన ఆస్పత్రిలో 36 పోస్టులు ఖాళీ

వరంగల్ అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాలకు అనుబంధంగా ఉన్న వరంగల్ ప్రభుత్వ ఆయుర్వేద బోధన ఆస్పత్రి 120 పడకల జీవో ఉన్నా 60 పడకల స్థాయి సాంక్షన్ పో స్టులు 61 మాత్రమే ఉన్నా యి. ఇందులోనూ మెడికల్ ఆఫీసర్లు, నర్సింగ్, రేడియోగ్రాఫర్, నాల్గ వ తరగతి సిబ్బంది తదితర 36 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అంతేకాకుండా ఈ ఆస్పత్రిలోని ఎక్స్‌రే యూనిట్ మూత పడి సుమారు 15 ఏళ్ల అవుతోంది. నిత్యం 70 మంది ఇన్ పేషంట్‌లు, 300 మంది అవుట్ పేషంట్ రోగులు వైద్య చికిత్స పొందుతున్న ఈ ఆస్పత్రిలో కనీసం పారిశు ధ్య, సెక్యూరిటీ సిబ్బందిలేరు. ఇదే తరహాలో హైదరాబాద్‌లోని చార్మినార్, ఎర్రగడ్డ ప్రభుత్వ ఆయుర్వేద బోధన ఆస్పత్రుల్లోనూ వైద్యులు, పారామెడికల్, నాల్గవ తరగతి, పారిశుధ్య సిబ్బంది తోపాటు అవసరమై వైద్య పరికరాలు, మౌలిక సదుపాయాల కొరతతీవ్రంగా ఉన్నట్లు తెలిసింది.

ఆయుర్వేద వైద్య విద్యపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టితో ఎన్‌సీఐఎస్‌ఎం ప్రమాణాలకు అనుగుణంగా రెండు ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాలలు, మూడు ఆయుర్వేద వైద్య బోధన ఆస్పత్రుల్లో సిబ్బంది నియామకాలతో పాటు మౌలిక సదుపాయాలు కల్పిస్తే బీఏఎంఎస్ ప్రవేశాలకు ఎలాంటి ప్రమాదం ఉండదని వైద్య విద్యార్థులు అంటున్నారు. లేనట్లయితే ఎప్పటి మాదిరిగానే కండీషన్ అనుమతులు, సీట్ల కోత తప్పదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రస్తుతం అల్లోపతి వైద్య విద్యపై ఏర్పాటు చేసిన విధంగానే ఆయుర్వేద వైద్య కళాశాలలు, బోధనాస్పత్రులపై మానిటరింగ్ కమిటీలను ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో సమస్యలు తెలుసుకుని పరిష్కరించి ఆయుర్వేద వైద్య విద్యను కాపాడాలని ఆయుర్వేద వైద్యులు ముఖ్యమంత్రినికి కోరుతున్నారు.

అడవిలో గొర్రెల గల్లంతు

- మూడు రోజులుగా గాలింపు.. కనిపించని జాడ

బయ్యారం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): అడవిలో గొర్రెలు గల్లంతైన ఉదంతం మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలో ఆలస్యంగా వెలుగుచూసింది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం..బయ్యారం మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన నరాల రమేష్‌కు చెందిన 120 గొర్రెలు ఈ నెల 26న సమీప పెద్ద గుట్ట అటవీ ప్రాంతానికి మేతకు తీసుకెళ్లాడు. శనివారం గుట్టపై విస్తారంగా కురిసిన వర్షానికి గొర్రెల మంద చెల్లాచెదురయ్యాయి. సుమారు 60 గొర్రెలు దారిమళ్లి గల్లంతయ్యాయి. నాటి నుంచి జీవాల కోసం రమేష్ కుటుంబ సభ్యులు, యాదవులు అటవీప్రాంతంలో వెతికినా వాటి జాడ తెలియలేదు. జీవాల విలువ సుమారు రూ. 10 లక్షలు ఉంటుందని అంచనా. అడవిలో తప్పిపోయిన గొర్రెలు ఎటు పోయాయో అర్థం కాక బాధితులు ఆందోళన చెందుతున్నారు. కాగా, ఈ విషయం సోషల్ మీడియాలో వైరలై చర్చనీయాంశంగా మారింది.

ఒకే కాన్పులో ముగ్గురి జననం

తల్లీబిడ్డలు క్షేమం



ఒకే కాన్పులో జన్మించిన ముగ్గురు శిశువులు

మహబూబాబాద్ క్రైం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కాన్పులో ఒక్కరు జన్మించడం సహజం. అక్కడక్కడ కవలలు జన్మిస్తారు. వీటికి భిన్నంగా ఒకే కాన్పులో ముగ్గురు జన్మించిన అరుదైన ఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో శనివారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ మండలం వీఎస్ లక్ష్మీపురం గ్రామానికి చెందిన రైతు గుండబోయిన సురేష్ భార్య కల్యాణి ఈ నెల 26న ప్రసవం కోసం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో అడ్మిట్ అయింది. శనివారం రాత్రి పురిటి నొప్పులు రావడంతో ప్రసవం కోసం అక్కడి వైద్యులు శస్త్రచికిత్స చేశారు. మొదటి కాన్పులో కల్యాణి ముగ్గురు పిల్లలకు జన్మనిచ్చింది. ఇందులో ఇద్దరు ఆడ శిశువులు కాగా, ఒక మగబిడ్డ. ముగ్గురు పిల్లలతోపాటు తల్లి ఆరోగ్యం నిలకడగా ఉన్న ట్లు వైద్యులు తెలిపారు. ఒకే కాన్పులో ముగ్గురు జన్మించడం పట్ల కుటుంబ సభ్యులు, బంధువులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

హాలహాలుడిగా రుద్రేశ్వరుడు

- వైభవంగా తొలి శ్రావణ సోమవారం వేడుకలు



హనుమకొండ కల్చరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని చారిత్రక వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో శివప్రీతికర సోమవారం తొలి శ్రావణ సోమవారం వేడుకలకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి రుద్రేశ్వరుడిని దర్శించుకున్నారు. ఆలయంలో కొలువై ఉన్న ఉత్తిష్ఠ గణపతికి క్షీరాభిషేకం, రుద్రేశ్వరుడికి అఘోర పాశుపద ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్ర శర్మ ఆధ్వర్యంలో మామిడాల గణపతి శోభ భక్తుల సహకారంతో ప్రత్యేక మహాన్నదానం నిర్వహించారు. రుద్రేశ్వరుడికి 200 మంది పుణ్య దంపతులతో సామూహిక రుద్రాభిషేకాలు నిర్వహించడమే గాక స్వామి వారికి 51 కిలోల పెరుగన్నంతో అన్నసూక్త మంత్రపఠనంతో హాలహాలుడిగా అలంకరింపజేసి అన్నపూజ నిర్వహించారు. లోక కల్యాణార్థం తొలి శ్రావణ వేడుకల సందర్భంగా నమయ చమకాలతో పాశుపత రుద్రహోమం నిర్వహించారు. ఉదయం నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈవో అనిల్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. గంగు ఉపేంద్రశర్మతోపాటు మణికంఠశర్మ, సందీప్‌శర్మ, ప్రణవ్‌శర్మ, శ్రవణాచారి, ఆలయ సిబ్బంది మధుకర్, రజిత సేవలందించారు. ఏనుగుల రాకేశ్‌రెడ్డితోపాటు అనేక మంది ప్రముఖులు దర్శించారు.

నేడు నాగుల పంచమి

శ్రావణ మాసంలో పంచమి తిథితో కూడిన వేళ మంగళవారం నాగుల పంచమి వేడుకలను భక్తులు ఆచరించనున్నారు. ముఖ్యంగా వేయిస్తంభాల ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహింపజేయనున్నట్లు ఈవో తెలిపారు.



వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో భక్తుల సందడి

పంటలకు ప్రాణమొచ్చింది..

- వరుస వర్షాలతో చెలక పంటలకు జీవం
- పత్తి, వరి, మక్కజొన్న చేన్లలో కలుపు పనులు షురూ
- నాట్లు వేసేందుకు పొలాలను సిద్ధం చేస్తున్నరైతులు
- ఆగస్టు చివరి వరకు నాటుకోవచ్చంటున్న అధికారులు



వరంగల్ మండలం పైడిపల్లిలో వరినాట్లు వేసిన దృశ్యం



వరంగల్ వ్యవసాయం, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : నాలుగు రోజులుగా కురిసిన వర్షాలతో పంటలకు ప్రాణమొచ్చింది. నెల రోజులుగా వర్షాలు లేక కొనఊపిరితో ఉన్న చేన్లకు జీవం వచ్చింది. దీంతో రైతుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఈ ఏడాది నైరుతి రుతు పవనాలు ముందుగా ప్రవేశించి తొలకరి వర్షాలు పడడంతో రైతులు పత్తి, మక్కజొన్న, కంది తదితర విత్తనాలు వేశారు. వరి నార్లు పోశారు. ఆ తరువాత వర్షాలు లేకపోవడంతో బావులు, బోరుబావుల కింద ఉన్నవారు ఎలాగోలా పంటలను కాపాడుకున్నారు. నీటి వసతి లేని వారు బిందెలతో మొక్కలకు నీరుపోసి కాపాడుకున్నారు. అయినప్పటికీ నెల రోజులుగా వర్షాలు కురవక పోవడంతో పంటలు ఎండిపోయే దశలో వర్షాలు సమృద్ధిగా పడడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

నిండుతున్న చెరువులు, కుంటలు..

జిల్లాలోని ఖానాపూర్ మండలం పాకాల సరస్సు పూర్తి స్థాయి నీటిమట్టం 30.3 ఫీట్లు కాగా, ఇప్పటికే 26.2 ఫీట్లకు చేరింది. ఆయకట్టు కింద 29,500 ఎకరాల్లో వరి సాగు అవుతోంది. వానాకాలం పంటకు సరిపడా నీళ్లు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. మరో నాలుగు ఫీట్ల నీరు చేరితే మత్తడి పడుతుంది. ఇప్పటికే నల్లబెల్లి మండలం వెంకటపాలెం చెరువు, సంగెం మండలం కుంటపల్లి చెరువు, నెక్కొండ మండలం పత్తిపాక చెరువు మత్తడి పోస్తున్నాయి. వాటితో పాటు మాధన్నపేట, రంగాయ చెరువు, గురిజాల పెద్ద చెరువు, దుగ్గొండి పెద్ద చెరువు, గుండం చెరువు, దేశాయిపల్లి గణేష్ చెరువు, వెంకటాపురం ఊరచెరువు ల్లోకి 60-70 శాతం నీరు చేరింది. మరో రెండు మూడు భారీ వర్షాలు కురిస్తే మత్తడి పోసే అవకాశం ఉంది. ఇక గీసుగొండ, పర్వతగిరి, రాయపర్తి, వర్ధన్నపేట, చెన్నారావుపేట, వరంగల్, ఖిలా వరంగల్ మండలాల్లోని చెరువులలో కొంతవరకు నీరు చేరింది.



వరంగల్ మండలం ఆరెపల్లిలో ఏపుగా పెరిగిన పత్తి

ఊపందుకున్న సాగు పనులు

ఇటీవల కురిసిన వర్షాలతో చెరువులు, కుంటలలోకి నీరు చేరడంతో వ్యవసాయ సాగు పనులు ఊపందుకున్నాయి. తొలకరి వర్షాలకు వేసిన పత్తి పంటలు ఇప్పుడు పూత దశలో ఉన్నాయి. మక్కజొన్న ఏపుగా ఎదిగింది. తొలకరి వర్షాలకు వరి నార్లు పోసిన వారు ఇప్పుడు నాట్లు వేస్తున్నారు. ఇప్పటికే 40 శాతం వరి నాట్లు పూర్తయ్యాయి. పత్తి, మక్కజొన్న, కంది, తదితర పంటల్లో కలుపు తీసి ఎరువులు వేస్తున్నారు. అలాగే పత్తి పంటకు క్రిమిసంహారక మందులు పిచికారీ చేస్తున్నారు. మరోవైపు వరి నార్లు పోసిన రైతులు నాట్లు వేసేందుకు పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు.

పంటలు పండుతాయన్న ధీమా పెరిగింది..



ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కుంటలు, చెరువుల్లోకి నీళ్ల వచ్చాయి. పంటలకు అదునుగా వర్షాలు కురువడంతో సాగుకు ఇబ్బంది లేకుండా ఉన్నది. ఇలాగే మధ్య మధ్యలో వర్షాలు కురిస్తే నీళ్లకు ఇబ్బంది ఉండదు. ఎస్సారెస్పీ కాలువ ద్వారా నీళ్ల వస్తే పంటలు విరివిగా పండుతాయి.


– ఆర్.శ్రీనివాస్, రైతు, మొగిలిచర్ల

వర్షాలు పంటలకు ప్రాణం పోశాయి..



నాలుగు రోజుల పాటు కురిసిన వర్షాలు పంటలకు ప్రాణం పోశాయి. కొద్ది రోజులుగా వర్షాలు లేక రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతున్న క్రమంలో వర్షాలు పడడంతో చెరువులు, కుంటల్లోకి నీరు చేరింది. పత్తి, కంది, మక్కజొన్న పంటలు కలుపు తీసి ఎరువులు వేసుకుంటున్నారు. వరి నాట్లు పడుతున్నాయి. ఆగస్టు చివరి వరకు నాట్లు వేసుకోవచ్చు. సాధారణంగా ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో కూడా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. కాబట్టి పంటలకు ఏమీ ఇబ్బంది ఉండదని అనుకుంటున్నాం.

– కె.అనురాధ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి



డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి : ఎస్పీ శబరీశ్

ఏటూరునాగారం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లాను డ్రగ్స్ రహితంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని ఎస్పీ శబరీశ్ అన్నారు. ఇందులో భాగంగానే పోలీస్‌శాఖ అభయ మిత్ర కార్యక్రమాన్ని ప్రారంభిస్తోందని తెలిపారు. మండల కేంద్రంలో ఫంక్షన్‌హాల్‌లో ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ అధ్యక్షతన సోమవారం జరిగిన అభయ మిత్ర అవగాహన కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, వాటికి అలవాటు పడి తమ జీవితాలను నాశనం చేసుకోకూడదని సూచించారు. ఏటూరునాగారం ఏజెన్సీ గ్రామాలలో ఎవరైనా అక్రమంగా గంజాయి వంటి మత్తు పదార్థాలను సరఫరా చేసినా, ఉపయోగించినా, విక్రయించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారికి పోలీస్‌శాఖ తరపున రూ. 10వేల రూపాలయ బహుమతి అందజేయబడుతుందని, అలాగే వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని ఎస్పీ స్పష్టం చేశారు. అంతేకాకుండా యువతీ, యువకులకు పోక్సో చట్టంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ప్రతి ఒక్కరూ విధిగా రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని, నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, గ్రామ పరిధిలో జరిగే రోడ్డు ప్రమాదాలపై వెంటనే స్పందించి పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. అనంతరం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ మాట్లాడుతూ.. ప్రజలు సైబర్ క్రైమ్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని, సైబర్ నేరగాళ్లు వివిధ మాధ్యమాల ద్వారా ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, అందువల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏటూరునాగారం సీఐ అనుముల శ్రీనివాస్, ఎస్సై రాజకుమార్, పోలీస్ సిబ్బందితో పాటు యాంటీ డ్రగ్ కమిటీల సభ్యులు, యువత, గ్రామ ప్రజలు, పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ శబరీశ్

ప్రజావాణి వినతులపై స్పందించాలి

భూపాలపల్లి కలెక్టరేట్, జూలై 28(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చే వినతులను తక్షణమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్ అధికా రులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహిం చిన ప్రజావాణిలో ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రాధాన్యత అనే దృష్టితో ప్రతి వినతిదారులకు న్యాయం చేయాలనే లక్ష్యంతో అధికారులు విధులు నిర్వర్తించాలన్నారు. ప్రజావాణిలో 58 వినతులు రాగా ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఆర్డీవో రవి తదితరులు పాల్గొన్నారు. అలాగే భూపాలపల్లి పట్టణంలోని అర్బన్ పీహెచ్‌సీని అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాజరు రిజిస్టర్, మందుల నిల్వ రిజిస్టర్‌ను పరిశీలించారు. ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

పంటల దశలనుబట్టి యూరియా

రేగొండ, జూలై 28(ఆంధ్రజ్యోతి) : పటల దశలనుబట్టి యూరియా సహకార సంఘాలకు వస్తుందని, రైతులు ఆందోళన చెందొద్దని అదనపు కలెక్టర్ విజయలక్ష్మి అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయాన్ని అదనపు కలెక్టర్ విజయలక్ష్మి సోమవారం సందర్శించారు. ఈ పాస్ మెషీన్ స్టాకు, స్టాక్ రిజిష్టరు నిల్వలు, బిల్లు బుక్కులు పరిశీలించారు. పీఏసీఎస్‌లో 1150 బస్తాల యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. ఆమె వెంట పీఏసీఎస్ ఛైర్మన్ విజ్ఞన్‌రావు, ఎంపీడీవో వెంకటేశ్వరరావు, వ్యవసాయ అధికారి వాసుదేవరెడ్డి, సీఈవో జగన్, తదితరులు ఉన్నారు.

కొత్తకార్డుకు రూ.2వేలు వసూలు ?

బీఆర్ఎస్, బీజేపీ నాయకుల ఆరోపణ

మొగుళ్లపల్లి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పర్లపల్లి, పోతుగల్లు, చింతలపల్లి గ్రామాల్లో నూతనంగా మంజూరైన రేషన్‌కార్డుల ప్రొసీడింగ్ పత్రాలను కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేస్తున్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఓట్ల కోసమే నూతన రేషన్‌కార్డుల ప్రొసీడింగ్ పత్రాలను పంపిణీ చేస్తున్నారని బీఆర్ఎస్, బీజేపీ నాయకులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రెవెన్యూ అధికారులు లేదా రేషన్ డీలర్లు మంజూరైన లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలను అందజేయాల్సి ఉంది. కానీ, ఇక్కడ కాంగ్రెస్ నాయకుల చేతుల్లోకి కొత్త రేషన్‌కార్డుల ప్రొసీడింగ్ పత్రాలు ఎలా వచ్చాయని ఆయా పార్టీల నేతలు ప్రశ్నిస్తున్నారు. అంతేకాకుండా ఓ గ్రామంలో కాంగ్రెస్ నాయకుడు కొత్తకార్డు మంజూరైన లబ్ధిదారుల నుంచి రూ.2వేలు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈవిషయమై స్థానిక తహసీల్దార్ సునీతను వివరణ కోరగా మండల వ్యాప్తంగా కొత్తగా మంజూరైన రేషన్‌కార్డుల ప్రొసీడింగ్ పత్రాలను లబ్ధిదారులకు ఇవ్వాలని రేషన్ డీలర్లకు మాత్రమే ఇచ్చామని, మాకు ఏపార్టీతో సంబంధం లేదని ఆమె స్పష్టం చేశారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

కాటారం, జూలై 28(ఆంధ్రజ్యోతి):మండలకేంద్రంలోని గంటగూడెంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన గోగుల దుర్గయ్య కుటుంబాన్ని బీజేపీ రాష్ట్ర నేత చల్ల నారాయణరెడ్డి, బీజేపీ జిల్లా, మండల నేతలు సోమవారం పరామర్శించారు. మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు బొమ్మన భాస్కర్‌రెడ్డి, నాయకులు వేణునాయక్, సాయి తదితరులు పాల్గొన్నారు. మండలంలోని తిరుమలపురం గ్రామానికి చెందిన పెళ్లి రవి (42) ఇంట్లో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన రవి - కోమల దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడు రవి ఆదివారం సాయంత్రం ఇంటి వద్ద గుర్తు తెలియని వ్యక్తిని తిడుతుండగా కుటుంబ సభ్యులు అడ్డుకున్నారు. రవి ఇంట్లో నిద్రిస్తుండగా కోమల ఇద్దరు పిల్లలు ఇంటి ముందు ఉన్న రేకుల షెడ్డులో నిద్రించారు. సోమవారం తెల్లవారుజామున బహిర్భూమికి వెళ్లేందుకు ఇంట్లో ఉన్న సెల్‌ఫోన్ లైట్ కోసం కోమల వెళ్లగా అప్పటికే రవి ఉరేసుకుని కనిపించడంతో కేకలు వేసింది. దీంతో చుట్టుపక్కలవారు చేరుకుని పరిశీలించగా అప్పటికే మృతి చెందాడు. మృతుడి తల్లి లింగమ్మ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు.

డీఈవోకు డీటీఎఫ్ వినతి

భూపాలపల్లిటౌన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖ అధికారి రాజేందర్‌కు డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని సోమవారం సమర్పించారు. 2008 కాంట్రాక్టు టీచర్ల వేతనాలు ఇవ్వాలని వినతి పత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో డీటీఎఫ్ అధ్యక్షులు చిలువేరు అశోక్, ప్రధాన కార్యదర్శి అయిత తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

మలేరియా నియంత్రణ సదస్సులో జిల్లా అధికారి

భూపాలపల్లి కలెక్టరేట్, జూలై 28(ఆంధ్రజ్యోతి): ఈనెల 28 నుంచి 30 వరకు న్యూఢిల్లీలోని నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన 2027 నాటికి దేశంలో జీరో మలేరియా కేసుల నమోదు కార్యక్రమంలో జిల్లా మలేరియా నియంత్రణ అధికారి ఉమాదేవి పాల్గొన్నారు. తెలంగాణ నుంచి ఈసమావేశంలో ఉమాదేవితో పాటు ఆదిలాబాద్, హైదారాబాద్ జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించినా ఉత్తుత్తి సౌకర్యాలే..

భూపాలపల్లిటౌన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నప్పటికీ ఆ పాఠశాల అభివృద్ధిపై అధికారులకు, ప్రజా ప్రతినిధులకు కనికరం లేదు. 220 మంది విద్యార్థులు ఉన్న ఈ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు 18 మంది ఉండగా ఒక్క అటెండర్ లేడు. ఒక తెలుగు, ఒక గణిత భోదకుడు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అయినప్పటికీ ఉపాధ్యాయులు అంతా తామై విద్యార్థులకు ఏమీ తక్కువ చేయకుండా ఫలితాలు తీసుకువస్తున్నారు. గత విద్యా సంవత్సరంలో పదో తరగతిలో జిల్లాలో ప్రథమ స్థానంలో ర్యాంకు సాధించారు. అలాగే 77 మంది విద్యార్థులలో 10 మంది 500 మార్కులకు పైగా ఉత్తమ ఫలితాలు సాధించారు. ఇంతా చేసినా కనీసం ఈ పాఠశాలలోని కొన్ని గదులకు విద్యుత్ దీపాలు లేవు. బాలబాలికలకు మరుగుదొడ్లు లే వు. సమావేశ మందిరానికి కింద ఫ్లోర్ వేయకుండానే సదరు కాంట్రాక్టరు చేతులు ఎత్తేశారు. అలాగే సీసీ రోడ్డు నిర్మాణం చేయాలి. క్రీడల కోసం స్థలం ఉన్నప్పటికీ స్థలాన్ని చదునుచేపించే నాథులే లేకుండా పోయారు. ఇన్ని అసౌకర్యాలతో ఉపాధ్యాయులు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా.. అధికారులు పట్టి ంచుకోకపోవడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఎమ్మెల్యేకు పలుమార్లు విన్నవించినట్లు కూడా పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే దృష్టి సారించి సమస్యల పరిష్కారం చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.


ఫ్లోరింగ్ చేయకపోవడంతో ఇబ్బందికరంగా మారిన మీటింగ్ హాల్

త్వరలోనే సోలార్ విద్యుత్ కేంద్రం

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు


లబ్ధిదారులకు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే

టేకుమట్ల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గర్మిళ్లపల్లి గ్రామ శివారులో త్వరలోనే సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేసి మహిళలను కోటీశ్వర్లను చేస్తానని ఎమ్మెల్యే మ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని గర్మిళ్లపల్లి గ్రామంలో వెలిశాల, దుబ్యాల, పెద్దంపల్లి, గిద్దెముత్తారం, కాల్వపల్లి గ్రామాల ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను ఆయన సోమవారం అందజేశారు. అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. ఇప్పటి వరకు మండలానికి 400 ఇళ్లు మంజూరు చేశామని, వాటి నిర్మాణం పూర్తి చేస్తే మరో దఫాలో మరో 600 ఇళ్లను మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం కలికోటపల్లిలో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మండల కేంద్రంలో ప్రభుత్వం పాఠశాలలో నిర్మించిన అదనపు తరగతి గదులను ప్రారంభి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి వీరభద్రం, హౌసింగ్ పీడీ లోకిలాల్, ఇన్‌చార్జి ఎంపీడీవో సురేష్, వివిధ శాఖల అధికారులు, చిట్యాల మార్కెట్ కమిటీ ఛైర్మన్ గుమ్మడి శ్రీదేవి, సత్యం, మాజీ జడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్, కాంగ్రెస్ జిల్లా నాయకులు దొంతుల శ్రీనివాస్, కత్తి సంపత్, తోట గట్టయ్య, వైనాల రవీందర్, తిప్పిరెడ్డి కృష్ణరెడ్డి, బండి రవీందర్, దాసారపు సదానందం, నాంపెల్లి వీరేశం, మాజీ ఎంపీటీసీ ఏనుగు లచ్చిరెడ్డి, సోరుపాక సదానందం తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన

చిట్యాల (ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్లగరిగ గ్రామంలో కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులకు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సోమవారం శంకుస్థాపన చేశారు. జెన్కో, సీఎస్ఆర్ నిధులు రూ.10లక్షలతో చేపట్టే నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే సత్యనారాయణరావు అన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో జయశ్రీ, ఎంపీవో రామకృష్ణ, కాంఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి, జిల్లా ప్రధానకార్యదర్శి మధువంశీకృష్ణ, నాయకులు రాజిరెడ్డి, రాజు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ది అబద్ధాల కుటుంబం

(5వ పేజీ తరువాయి)

వచ్చినా ఇంకా అధికార అహంకారం తగ్గలేదని విమర్శించారు. తెలంగాణలో కేసీఆర్ ఇంట్లోంచే అబద్ధాలు పుట్టాయని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రం వచ్చాక అధికారం చేజిక్కించుకున్న కేసీఆర్ కుటుంబం అవినీతి అక్రమాలకు పాల్పడిందని విమర్శించారు. హామీలు నెరవేర్చకుండా విదేశాల సోషల్ మీడియాను వినియోగించుకుని పనిగట్టుకుని తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని రూ.8లక్ష కోట్ల అప్పుల్లోకి నెట్టివేసినా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలకు కట్టుబడి ఒక్కొక్కటిగా అన్నింటినీ నెరవేరుస్తోందని అన్నారు. కేటీఆర్‌తో పాటు హుజురాబాద్‌లో కూడా ఇంకో బచ్చాగాడు ఉన్నాడని, అతనికి కూడా ప్రజలు బుద్ధి చెబుతారని అన్నారు.

దేశం గర్వించేలా బీసీ గణన

దేశం గర్వించేలా బీసీల కుల గణనచేసి 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్యే గండ్ర అన్నారు. దీనిని పార్లమెంటు ఉభయ సభల్లో బిల్లు ప్రవేశపెట్టేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. దీంతో 96కులాల వర్గాలకు న్యాయం జరుగుతుందని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో లక్ష కోట్ల అప్పు చేసి అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. వారి అవినీతి వల్లే ఆ ప్రాజెక్టు కుంగిపోతే కాంగ్రెస్ ప్రభుత్వమే బాంబులుపెట్టి కూల్చి వేశారని ఆరోపించడం విడ్డూరమన్నారు. కాంగ్రెస్‌కు మంచి పేరు వస్తుందని భావించిన బీఆర్ఎస్ నేతలు చేసేదేమీ లేక ఇష్టమొచ్చినట్లు అబద్ధాలు మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. శిలాఫలకాలపై ఫొటోలు పెట్టకూడదని ఎక్కడా లేదని, కొందరు అభిమానులు పెట్టుకుంటే.. దానిని వక్రీకరించడం సిగ్గుచేటని అన్నారు. ఢిల్లీలో సైతం ఫొటోలు పెడుతారని అన్నారు. కాంగ్రెస్ వాళ్లు ఇసుక దందాకు పాల్పడుతున్నట్లు ఆరోపించిన వారే గతంలో పెద్ద ఎత్తున ఇసుక దందా, పెట్రోల్ బంక్‌లపై కేసులు, కలప అక్రమ రవాణాకు పాల్పడ్డారని అన్నారు. తనకు ఎలాంటి వ్యాపారాలు లేవని చెబుతున్న మాజీ ఎమ్మెల్యేకు క్రషర్ మిల్లులు, జిన్నింగ్ మిల్లులు, సినిమా థియేటర్లు, పెట్రోల్ బంక్‌లు, రియల్ ఎస్టేల్ వ్యాపారం, విదేశాల్లో వ్యాపారాలు ఉన్నాయని అన్నారు. పైగా ఎమ్మెల్యేగా కొనసాగిన కాలంలో నిర్మించిన మెడికల్ కళాశాలలో, ఆయుష్ వైద్యశాలలో ఎలాంటి సిబ్బంది, సౌకర్యాలు లేవని అన్నారు. కానీ తాను వచ్చాక సౌకర్యాల కల్పనతో పాటు అధ్యాపకులు, సిబ్బంది, వైద్యుల నియామకం చేశామని అన్నారు. అలాగే వంద పడకల ఆస్పత్రిని 300 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేస్తున్నామని స్పష్టం చేశారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం రూ.500కోట్లు మంజూరు చేయించి పనులు ప్రారంభించినట్లు తెలిపారు. అలాగే అక్రమణకు గురికానున్న 157 ఎకరాల భూమిని కాపాడి అందులో రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం, ఇండస్ట్రియల్ పార్కు కోసం పనులు చేపట్టినట్లు తెలిపారు. తాను ఎవరిపై అక్రమ కేసులు పెట్టలేదని స్పష్టం చేశారు. కానీ మాజీ ఎమ్మెల్యే గత ప్రభుత్వ హయాంలో అనేక అక్రమ కేసులు బనాయించి వారిని బెదిరించి పార్టీలోకి తీసుకున్నారని విమర్శించారు. పరువునష్టం దావావేస్తే అది కోర్టులో తేల్చుకోవాలని, దానిని రాజకీయంగా మాట్లాడడం అవగాహన రాహిత్యం అవుతుందని అన్నారు. కాళేశ్వరం నీరు ఈ ప్రాంత రైతులకు అందలేదని, కేవలం సిద్దిపేట, గజ్వేల్‌కు మాత్రమే వెళ్లాయని అన్నారు. అలాంటిది దానిపై మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. ఇందిరమ్మ ఇళ్లు అర్హులైన నిరుపేదలకే ఇస్తామని స్పష్టం చేశారు. అలాగే ఇప్పటికే నర్సింగ్ కళాశాలను తీసుకొచ్చామని, త్వరలో మహిళల కోసం రూ.5.50 కోట్లతో ట్రైనింగ్ సెంటర్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపారు. భూపాలపల్లి మునిసిపాలిటీకి రూ.70కోట్లు మంజూరు అయ్యాయని, వాటితో పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దనున్నామని అన్నారు. గ్రామాల అభివృద్ధి కోసం కేంద్ర మంత్రుల వద్దకు వెళతాం అని అన్నారు. ఊసరవెల్లిలా మాట్లాడే బీఆర్ఎస్ నాయకులు తమ పద్ధతిని, భాష విధానాన్ని మార్చు కోవాలని హితవు పలికారు. లేకపోతే ప్రజలే మళ్లీ తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. ఈ సమావేశంలో టీపీసీసీ సభ్యుడు చల్లూరి మధు, నాయకులు అప్పం కిషన్, దాట్ల శ్రీనివాస్, పిప్పాల రాజేందర్, రాంనేని రవీందర్, ముంజాల రవీందర్, అంబాల శ్రీనివాస్, సాంబమూర్తి, సంతోష్, రంజిత్, పద్మ, సమ్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొండాయిలో ఉండలేం..

(5వ పేజీ తరువాయి)

దొడ్ల సమీపంలోని ప్రాంతానికి చేరారు.

రెండేళ్లుగా భయాందోళనల మధ్య కాలం వెళ్లదీస్తున్నామని, వానాకాలం వచ్చిందంటే జంపన్నవాగు ఉధృతికి వణికి పోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని అంటున్నారు. రెండేళ్ల క్రితం జంపన్నవాగు గ్రామాన్ని నిండముంచగా సర్వస్వం కోల్పోయామని, ఇళ్లన్నీ జలమయం అయ్యాయని అంటున్నారు. అప్పటి అధికారులు గ్రామాన్ని వేరే ప్రాంతానికి తరలిస్తామని హామీనిచ్చి ఏళ్లు గడుస్తున్నా దాని గురించే పట్టించుకోవడం లేదన్నారు. దీంతో చేసేదేమీ లేక తమకు తామే వేరే ప్రాంతానికి వెళ్లి తలదాచుకోవాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే.. కొండాయికి చెందిన 20 కుటుంబాలు దొడ్ల సమీపంలో వెళ్లగా ఆ గ్రామస్థులు వారిని అడ్డుకున్నారు. చాలా ఏళ్లుగా తామే ఇక్కడ ఉంటున్నామని, మీరు ఇక్కడెందుకు వచ్చారని ప్రశ్నించారు. వేరే ప్రాంతానికి వెళ్లండని అడ్డుకోగా స్వల్ప వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ నేపథ్యంలో దొడ్ల గ్రామ సమీపంలోకి వెళ్లగా ఆ గ్రామస్థులు తమను అడ్డుకున్నారని, తమకు శాశ్వత పరిష్కారం చూపాలని ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రత్యేక అధికారి శశాంకను కొండాయి వాసులు కోరారు. దొడ్ల వద్ద జంపన్నవాగును పరిశీలించేందుకు వెళ్లిన ఆయన కాన్వాయ్‌ను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10 రోజుల్లో సమస్యను పరిష్కరించేలా చర్యలు చేపడతామని హామీనిచ్చారు.

ముమ్మరంగా పోలీసుల తనిఖీలు

(5వ పేజీ తరువాయి)

ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. వాహనాల ధ్రువీకరణ ప్రతాలు, డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని వాహనదారులను హెచ్చరిస్తున్నారు. ఆయా గూడాలల్లో స్పెషల్ పార్టీ, గ్రేహౌండ్స్, సివిల్, సీఆర్పీఎఫ్ పోలీసులు సంచరించి ఇంటింటా సోదాలు చేస్తున్నారు. మావోయిస్టు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలతో పాటు సరిహద్దు ప్రాంతాల్లో వరుసగా ఎన్కౌంటర్లు జరుగుతున్న నేపథ్యంలో పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు.

సింగరేణి పాఠశాలకు వ్యాన్ సౌకర్యం కల్పించాలని ధర్నా

కృష్ణకాలనీ, జూలై 28 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లిలోని సింగరేణి పాఠశాలకు ఇప్పటి వరకు కనీసం వ్యాన్ సౌకర్యం కల్పించపోవడాన్ని నిరసిస్తూ సోమవారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని జీఎం కార్యాలయం ఎదుట ఆ పాఠశాల విద్యార్థులతో కలిసి ఏఐఎస్ఎఫ్ నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోత్కు ప్రవీణ్‌కుమార్ పాఠశాల ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా యాజమాన్యం ఇంతటి నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే పేద విద్యార్థులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించలేక అనేక అవస్థలు పడుతున్నార అన్నారు. ఇప్పటికైనా పాఠశాల యాజమాన్యం స్పందించి వెంటనే వ్యాన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎస్‌వోటూ జీఎం కవీంద్రకు వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నేరేళ్ల జోసెఫ్, దొంతరబోయిన అజయ్, మేడి శేఖర్, జంపాల పవన్, శ్రీకాంత్, నవీన్, అక్షిత్, వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.

'భోజనం' బిల్లులు చెల్లించాలి : సీఐటీయూ

ములుగు టౌన్ 28 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని సీఐటీయూ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డీఈవో చంద్రకళకు ఈ మేరకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ మాట్లాడుతూ 2023-2024 విద్యా సంవత్సరానికి సంబంధించిన బిల్లులను మధ్యాహ్న భోజన కార్మికులకు చెల్లించాలని, అలాగే విద్యార్థులకు ఐదు నెలల మెస్ చార్జీలు విడుదల చేయాలని కోరారు. మధ్యాహ్న భోజన కార్మికులకు ఒక్కొక్కరికి రూ. 50 వేల నుంచి రూ. 3 లక్షల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు తిప్పని లక్ష్మి, రాజ కుమారి, స్వరూప, కమల, ప్రమీల, లలిత, రాధ, కనకలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలి

ఏటూరునాగారం రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : గిరిజనులు తమ దృష్టికి తీసుకొస్తున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా అధికారులు కృషి చేయాలని ఐటీడీఏ ఏపీవో వసంతరావు అన్నారు. ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం జరిగిన గిరిజన దర్బార్‌లో గిరిజనుల వద్ద నుంచి ఆయన వినతులు స్వీకరించారు. గిరిజన దర్బార్‌లో మొత్తం 25 మంది వినతులు అందించారు. మంగపేట, వాజేడు, తాడ్వాయి, ములుగు, ఏటూరునాగారం, వెంకటాపురం తదితర మండలాల నుంచి వచ్చిన గిరిజనులు ఏపీవోకు వినతులు అందించారు. ఉద్యోగావకాశాలు, గొత్తికోయ గూడాల్లో మౌలిక సౌకర్యాలు, పాఠశాలలో ఉపాధ్యాయుల నియామకం, ఆర్వోఎఫ్ఆర్ భూములకు పట్టాలివ్వడం తదితర సమస్యలను ఏపీవో దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో డీడీ పోచం పాల్గొన్నారు.

హాస్టల్స్ మంజూరు చేయాలి : కేవీపీఎస్

ములుగు టౌన్ 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు ఎస్సీ, ఎస్ఎంహెచ్ హాస్టల్స్ మంజూరు చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) నేతలు అదనపు కలెక్టర్ సంపత్‌రావుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఎస్సీ విద్యార్థులకు హాస్టల్ వసతి లేకపోవడంతో విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని, చదువులకు వారు దూరమవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి రత్నం ప్రవీణ్, సహాయ కార్యదర్శి జన్ను దేవేందర్, మండల నాయకుడు జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌కు రైస్ మిల్లర్ల సన్మానం


కల్యాణిని సన్మానిస్తున్న రైస్ మిల్లర్స్

ములుగు రూరల్ 28 ఆంధ్రజ్యోతి): ములుగు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా నియామకమైన రేగ కల్యాణిని జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం సన్మానించారు. అసోసియేషన్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ పేద సారంగం, సెక్రటరీ సోనియా, గోవిందరావుపేట పీఏసీఎస్ ఛైర్మన్ ఎల్లారెడ్డి, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కార్యదర్శి సహోదర్‌రెడ్డి, కోశాధికారి ఎనగందుల మోహన్, ఉపాధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్యం షాపు నిర్వహణకు గ్రామ సభ ఆమోదం

వాజేడు, జూలై 28(ఆంధ్రజ్యోతి): నాగారం పంచాయతీలో మద్యం షాపు నిర్వహణకు గ్రామ సభ ఆమోదం తెలిపింది. సోమవారం రైతు వేదిక వద్ద మద్యం షాపు నిర్వహణకు ఎంపీడీవో శ్రీకాంత్ నాయుడు గ్రామ సభను నిర్వహించారు. షాపు నిర్వహణ తమకు సమ్మతమే అంటూ సుమారు 100 మందికి పైగా ఓటర్లు ఆమోదం తెలిపారు. కోరం సరిపోవడంతో తీర్మానాన్ని ఉన్నతాధికారులకు పంపిస్తామని ఎంపీడీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో జీపీ కార్యదర్శి ప్రభాకర్, పెసా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

డీఎంహెచ్‌వో గోపాల్‌రావు

ఏటూరునాగారం రూరల్, జూలై28 (ఆంధ్రజ్యోతి) : రోగాల బారినపడి వైద్యశాలకు వస్తున్న రోగులకు మెరుగైన సేవలు అందించాలని ములుగు జిల్లా వైద్యాధికారి (డీఎంహెచ్‌వో) గోపాల్‌రావు అన్నారు. ఏటూరునాగారం మండల కేంద్రంలోని సామాజిక వైద్యశాలను తనిఖీ చేశారు. వైద్యశాలకు చేరుకున్న ఆయన ఆయా విభాగాల్లోని రోగులకు అందుతున్న వైద్యసేవలను పరిశీలించారు. వైద్యాధికారులు, సిబ్బందికి సంబంధించిన హాజరు పట్టికను పరిశీలించి విధులకు డుమ్మాకొట్టిన వారిపై ఆరా తీశారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో క్రాంతికుమార్ ఉన్నారు.

బాలికలు పరిశుభ్రత పాటించాలి

వెంకటాపూర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా బాలికలు శుభ్రతను పాటించాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి శ్రీకాంత్ సూచించారు. మండల కేంద్రంలోని తెలంగాణ మైనారిటీ బాలికల జూనియర్ కళాశాలలో వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్యశిబిరం సోమవారం జరిగింది. 22 మంది బాలికలకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం, వ్యాయామం, మెడిటేషన్ ప్రాముఖ్యత గురించి వివ రించారు. రామాంజాపూర్‌లోని చెంచుకాలనీలో ఉన్న ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలను వైద్యాధికారి సందర్శించి శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల రీజినల్ కోఆర్డినేటర్ సతీష్, ప్రిన్సిపాల్ వందన, పాలంపేట ఆయుష్మాన్ ఆరోగ్యమందిర్ డాక్టర్ భవ్య, డెమో సంపత్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌లు పూర్ణ, సంపత్‌రావు, సీహెచ్‌సీ శోభ, హెల్త్ సూపర్‌వైజర్ పుష్పకుమారి, ఆరోగ్య కార్యక ర్తలు అనురాధ, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టర్‌కు బీఆర్ఎస్ చేయూత

వాజేడు, జూలై 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇప్పగుడెం గ్రామా నికి చెందిన అంతర్జాతీయ పవర్ లిఫ్టర్ మొడెం వంశీ ఇటీవల ఇండి యా తరుపున నార్త్ అమెరికాలో జరిగే పోటీలకు ఎంపికయ్యాడు. ఈ క్రమంలో ప్రయాణానికి సుమా రు రూ. లక్షల మేరకు ఖర్చు అవుతుండటంతో బీఆర్ఎస్ మండల నాయకులు సాయం అందించారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్షణ్ స్పందించి రూ. 25 వేల ఆర్థిక సాయం చేశారు. నూగూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బోడెబోయిన బుచ్చయ్య రూ. 50వేల ఆర్థిక సాయం ప్రకటించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెనుమల్లు రామకృష్ణారెడ్డి, నాయకులు ముడిగ తిరుపతి యాదవ్, చెన్నం సాంబశివరావు, ప్రకాశ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో వర్గ విభేదాలు లేవు : కాకులమర్రి

మంగపేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ జిల్లా కమిటీలో వర్గ విభేదాలు లేవని, అందరూ పార్టీ కోసం కృషి చేస్తున్నారని జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనరసింహారావు స్పష్టం చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆయన సోమవారం పర్యటించారు. బీఆర్ఎస్ పార్టీలో విభేదాలు ఉన్నాయని కొందరు విష ప్రచారం చేస్తున్నారని, వాటిని ఎవరూ నమ్మొద్దని అన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కుడుముల లక్ష్మీనారాయణ, గుండేటి రాజుయాదవ్, జిల్లా సమన్వయకర్తలు తాటి కృష్ణ, కాకులమర్రి ప్రదీప్‌రావు, తుమ్మ మల్లారెడ్డి, కొమరం ధనలక్ష్మి, యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి బాడిశ నాగరమేష్, మంగపేట సహకార సంఘం చైర్మన్, వైస్ చైర్మన్లు తోట రమేష్, నరేందర్‌యాదవ్, సహకార సంఘం డైరెక్టర్లు సిద్దంశెట్టి లక్ష్మణ్‌రావు, మల్లూరు గుట్ట మాజీ చైర్మన్లు నూతలకంటి ముకుందం, పూజారి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.